RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 303 మేడ్చల్ మల్కాజ్‌గిరి 24 నవంబర్ 2024 ఆదివారం పేజీలు : 4

## మణిపూర్‌కు మరో 10 వేల మంది భద్రతా సిబ్బంది

న్యూఢిల్లీ : కల్లోలిత మణిపూర్ రాష్ట్రానికి మరో 10 వేలమంది కిపైగా భద్రతా సిబ్బందిని పంపాలని కేంద్రం నిర్ణయించింది. ఈమేరకు ఆ రాష్ట్ర ముఖ్య భద్రతా సలహాదారు కుల్దీప్ సింగ్ ఇంఫాల్‌లో విలేకరులకు తెలిపారు. దీంతో మొత్తం 288 కంపెనీల భద్రతా సిబ్బందిని ఆ రాష్ట్రంలో మోహరించినట్లు అవుతుంది. మణిపూర్‌లో సున్నిత ప్రాంతాల్లో ఈ సిబ్బందిని నియమించనున్న ట్లు సింగ్ వెల్లడించారు. మరోవైపు, మణిపూర్‌లో ప్రస్తుతం నెలకొన్న సంక్షోభ పరిస్థితులకు గత కాంగ్రెస్ ప్రభుత్వాలే కారణమని కేంద్ర మంత్రి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. మణిపూర్‌లో హింసాత్మక ఘటనలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే రాష్ట్రపతికి లేఖ రాసిన విషయం తెలిసిందే. దీనికి జేపీ నడ్డా ఖర్గేకు కౌంటర్ లేఖ రాశారు.



# మహారాష్ట్ర పట్టం మహా'యుక్తి'కే..!

## పడిలేచిన కమలం.. అధికారం నిలబెట్టుకొన్న మహాయుతి..!

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా నేతృత్వంలోని మహాయుతి సర్కారు పట్టు నిలుపుకొంది. 2019 నుంచి ముగ్గురు ముఖ్యమంత్రులు, నలుగురు డిప్యూటీ సీఎంలను చూసిన ఈ రాష్ట్ర ఎన్నికలు హోరాహోరీగా జరిగాయి.

ఓబీసీ ఓట్ల సమీకరణ, ఆకర్షణీయమైన పథకాలు, మహిళల ఓట్లు విజయంలో కీలక భూమిక పోషించాయి. భాజపా, శివసేన శిందే, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ.. ఇలా మూడు పార్టీలు మెరుగైన ప్రదర్శన చేయడం కూటమి విజయానికి దోహదం చేశాయి.

**ఓబీసీల భయాలు..** ఈ ఎన్నికలను అత్యధికంగా ప్రభావితం చేసిన అంశం ఓబీసీ సమీకరణ. కీలకమైన మరాఠా ఓటర్లు మహావికాస్ అఘాడీలోని కాంగ్రెస్ వైపు కొంత మొగ్గు చూపుతున్నట్లు గ్రహించిన కమల బృందం తన వ్యూహానికి పదును పెట్టింది. మరాఠా వంటి బలమైన వర్గం కాకుండా ఉన్న ఇతరత్రా వర్గాలన్నింటినీ భాజపా ఏకీకృతం చేసింది. ముఖ్యంగా ఓబీసీ ఓట్ల పైనే ప్రధానంగా దృష్టి పెట్టింది. భాజపా ఈ రాష్ట్రంలో 90ల నుంచే వీరిని తమ వైపు ఆకర్షించడానికి యత్నాలు మొదలుపెట్టింది. ముఖ్యంగా మాలి, ధంగర్, వంజరి వర్గాలు కమలనాథులకు అండగా ఉన్నాయి. మరాఠాలకు ఓబీసీ రిజర్వేషన్లు ప్రకటిస్తే తమ వాటా తగ్గుతుందని చాలా జాతుల్లో భయాలున్నాయి. వాటిని కమలం పార్టీ ఓట్లుగా మలుచుకుంది. మరోవైపు మహావికాస్ అఘాడీ మాత్రం పూర్తిగా మరాఠా రిజర్వేషన్ల అంశంపైనే ఆధారపడింది. అధికారంలోకి వస్తే వారికి రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చింది. చిత్రం ఏంటంటే, మరాఠా వర్గానికి ఏక్‌నాథ్ శిందే అక్కడ ముఖ్యమంత్రిగా ఉన్నారు. 'మహాయుతి' ముఖ్య నేతగా పేరొందారు. దాంతో మహావికాస్ అఘాడీ ఆశించిన స్థాయిలో పెద్ద ఎత్తున మరాఠా ఓట్లు వాళ్లకి పడలేదు.

**భాజపా-కాంగ్రెస్ ముఖాముఖి పోరు..** ఈసారి ప్రధాన పార్టీలైన భాజపా- కాంగ్రెస్ 76 సీట్లలో ముఖాముఖి తలపడ్డాయి. గత కొన్నేళ్లుగా పలుచోట్ల జరిగిన ఇలాంటి పోరులో హస్తం పార్టీ పక్షాన సానుకూల ఫలితాలు వచ్చిన సందర్భాలు అతి తక్కువ. ఈసారి ఫలితాలను జాగ్రత్తగా గమనిస్తే.. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 44 సీట్లను గెలుచుకోగా.. ఈసారి ఆ సంఖ్య గణనీయంగా పడిపోయింది. ఆ మేరకు భాజపాకు సీట్ల సంఖ్యలో పెరుగుదల కనిపించింది.

**అధికార ద్వారం విదర్భలో పుంజుకొని..** మహారాష్ట్ర రాజకీయాల్లో 11 జిల్లాలున్న విదర్భలో విజయాన్ని అధికారానికి ద్వారంగా భావిస్తారు. ఇక్కడ 62 స్థానాలున్నాయి. కొన్నేళ్లుగా ఇక్కడ భాజపా ఆధిక్యాన్ని ప్రదర్శిస్తోంది. కానీ, 2019లో కొంత మెజార్టీ తగ్గింది. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఇక్కడ భాజపా తీవ్రంగా దెబ్బతింది. ఫలితంగా మహావికాస్ అఘాడీ 10 మంది ఎంపీలను దక్కించుకొంది. ఈ అసెంబ్లీ ఎన్నికల్లోనూ తమదే హవా అనుకుంది. కానీ ప్రచారం మొదలయ్యాక, ఎన్నికల దగ్గర పడ్డాక పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ముఖాముఖి తలపడ్డ స్థానాల్లో దాదాపు 40 సీట్లలో మహాయుతి విజయం సాధించింది. ఈ ప్రాంతం వ్యవసాయాధారితమైంది. పత్తి, సోయాబీన్ ప్రధాన పంటలు. కాంగ్రెస్ ఇక్కడి వారిని ఆకట్టుకొనేందుకు చేసిన ప్రచారం అంతగా ఫలితం చూపలేదు. సోయా రైతులకు రూ.7,000 మద్దతు ధర ఇస్తామని చెప్పినా ఫలితం రాలేదు. విదర్భ ప్రాంతంలోని నాగ్‌పుర్‌లో ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయం ఉంది. ఆ సంస్థ ప్రభావం అక్కడా, ఆ చుట్టుపక్కల ప్రాంతాలపై బలంగా పనిచేసింది. గత ఎన్నికల్లో కమలం విషయంలో ఆర్ఎస్ఎస్ కాస్త కినుక వహించిందన్న ప్రచారం జరిగింది. ఈసారి మాత్రం వారి మద్దతు మహాయుతికి బాగా లభించినట్లు చెబుతున్నారు.

**మహిళల ఓట్లు కమలం పక్షాన..** రాష్ట్రంలోని మహిళా ఓట్లను 'లడ్కీ బెహన్ పథకం' కూడగట్టింది. రూ.1,500 నేరుగా వారి ఖాతాల్లో వేయడంతో లబ్ధిదారులు 'మహాయుతి' వైపు నిలిచారు. ఈసారి ఆ మొత్తాన్ని రూ.2,100 చేస్తామని కూటమి హామీ ఇచ్చింది. కాంగ్రెస్ పోటీగా రూ.3,000 ఇస్తామని పేర్కొంది. అయినా ఓటర్లు భాజపా కూటమికే పట్టం కట్టారు. ఈ పథకం వల్ల అత్యధిక ప్రయోజనం పొందిన పుణె, థానే, నాసిక్, నాగ్‌పుర్, షోలాపుర్ జిల్లాల్లో మహిళల ఓటింగ్ పోటెత్తడం భాజపాకు బాగా కలిసొచ్చింది.

**రైతులను ఆకట్టుకొన్న మహాయుతి..** మహాయుతి కూటమి రైతులకు ఇప్పటికే కిసాన్ సమ్మాన్ యోజన పథకం కింద ఇస్తున్న రూ.12,000లని రూ.15,000కు పెంచుతామని హామీ ఇచ్చింది. దీంతోపాటు కనీస మద్దతు ధర (ఎమ్మెస్పీ)కు అనుబంధంగా రేట్లలో తేడాను 20శాతం వరకు కవర్ చేసేలా ధరల మద్దతు పథకాన్ని తెస్తామని హామీ ఇచ్చింది. బీద రైతులకు మేలు జరిగేలా అక్షయ అన్నయోజన స్కీమ్‌ను ప్రవేశపెడతామంది. దీనిలో బియ్యం, జొన్నలు, శనగ నూనె, ఉప్పు, పంచదార, పసుపు, ఆవాలు, కారం వంటివి ప్రతినెలా ఇస్తామని పేర్కొంది. వీటితో పాటూ నదుల మళ్లింపు చేపట్టి పొలాలకు నీరు అందిస్తామని ప్రకటించింది. ఇవన్నీ అన్నదాతలను ప్రభావితం చేశాయి. మహారాష్ట్రలో ఉల్లిని ఎక్కువగా ఉత్పత్తి చేస్తుంటారు. ఉల్లిపై ఆంక్షలు విధించడంపై కొంతకాలంగా ఉల్లి రైతులు గుర్రుగా ఉన్నారు. పలు చోట్ల రోడ్లెక్కిన సందర్భాలూ ఉన్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో భాజపా కూటమిపై ఆ ప్రభావం పడింది. ముఖ్యంగా నాసిక్ ప్రాంతంలో తాము ఉల్లి రైతుల ఆగ్రహాన్ని చవిచూసినట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే స్వయంగా ఓ సందర్భంలో వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ఉల్లి ఎగుమతులపై ఆంక్షలు తొలగించడం గమనార్హం. కమల కూటమిపై రైతుల్లో ఉన్న అసంతృప్తిని ఈ చర్యతో చల్లార్చగలిగారు.

**ఓట్ల బదలాయింపు సజావుగా..** మహాయుతిలో ఓట్ల బదలాయింపు సజావుగా సాగినట్లు ఫలితాలు వెల్లడిస్తున్నాయి. మరోవైపు మహావికాస్ అఘాడీలో సీట్ల సర్దుబాటు వేళ తలెత్తిన విభేదాలు ఎన్నికలపై ప్రతికూల ప్రభావం చూపాయి. కాంగ్రెస్ నిర్ణయాలకు దిల్లీ అనుమతులుండాలంటూ సంజయ్ రౌత్ విమర్శించడం, దీనికి హస్తం నేత నానా పటోలే స్పందన వంటివి ఇరు పార్టీల ఓటర్లను ఏకం కాకుండా చేశాయి. అఘాడీ కూటమిని నష్టపర్చాయి.




## ఝార్ఖండ్ ముక్తి మోర్చా మరోసారి జయకేతనం

ఆదివాసీ కోటలో ఝార్ఖండ్ ముక్తి మోర్చా మరోసారి జయకేతనం ఎగురవేసింది. ఈడీ కేసులు మొదలు.. అరెస్టులు.. తిరుగుబాట్లు.. ప్రత్యర్థుల వ్యూహాలు.. ఇలా అనేక సవాళ్లను ఎదుర్కొన్న జేఎంఎం.. ఎగ్జిట్ పోల్ అంచనాలను తలకిందులు చేస్తూ విజయాన్ని సాధించింది. 'బంటీ ఔర్ బబ్లీ'గా పేరొందిన హేమంత్-కల్పనాల జోడీ సూపర్ హిట్ కొట్టింది. రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి రాజకీయ అస్థిరతకు కేరాఫ్‌గా నిలిచిన ఝార?ండ్‌లో.. మరోసారి స్పష్టమైన మెజార్టీ సాధించి సుస్థిర పాలన దిశగా అడుగులు వేసేందుకు సిద్ధమవుతోంది.

**సవాళ్లు ఎదురైనా..** అసెంబ్లీ ఎన్నికలకు ఏడాది ముందే ఝార?ండ్ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఓ భూ వివాదానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో హేమంత్ సోరెన్ అరెస్టై జైలుకు వెళ్లడం సంచలనం రేపింది. ఇదే అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించిన భాజపా.. హేమంత్ ప్రభుత్వం అవినీతిమయమైందని, బంగ్లాదేశ్ చొరబాటుదారులకు మద్దతిస్తోందని మండిపడింది. దాని వల్ల గిరిజనులకు చెందాల్సిన వనరులను వారు దోచుకుంటున్నారని ఆరోపించింది. చంపాయీ సోరెన్‌ను సీఎం పదవి నుంచి తప్పించడం గిరిజనులను అవమానపరచడమేనని ప్రచారం చేసినప్పటికీ ఫలితాలు ఆ పార్టీకి అనుకూలంగా రాలేదు.

**సంక్షేమం, గిరిజనమే..** ప్రధాన భాగస్వామ్య పక్షం (కాంగ్రెస్) ఆశించిన మద్దతు ఇవ్వకున్నా.. సంక్షేమ పథకాలు, ఆదివాసీ సెంటిమెంటును నమ్ముకున్న సోరెన్ ప్రభుత్వం అనుకూల ఫలితాలు సాధించింది. హేమంత్ అరెస్టును రాజకీయ ప్రేరేపిత చర్యగా ఆరోపించిన జేఎంఎం.. ఆదివాసీ సెంటిమెంటును తమవైపు తిప్పుకొంది. ముఖ్యమంత్రి మైయా సమ్మాన్ యోజన పేరుతో మహిళలకు నెలకు రూ.వెయ్యి ఇచ్చే పథకాన్ని ప్రధానంగా ప్రచారం చేసిన సోరెన్ సర్కారు.. ఈ మొత్తాన్ని రూ.2500లకు పెంచుతామని హామీ ఇచ్చింది. 'సర్నా'ను ప్రత్యేక మతంగా గుర్తించాలని తీర్మానిస్తూ కేంద్రానికి లేఖ రాయడం కూడా కలిసొచ్చినట్లు తెలుస్తోంది.

**చంపాయీ, సీతా మొండిచేయి..** హేమంత్ అరెస్టు నేపథ్యంలో సీఎం పగ్గాలు చేపట్టిన చంపాయీ.. సోరెన్ బయటకు రాగానే రాజీనామా చేయాల్సి వచ్చింది. దీంతో తీవ్ర అసంతృప్తికి లోనైన ఆయన.. భాజపాలో చేరిపోయారు. హేమంత్ వదిన సీతా సోరెన్ కూడా కాషాయ కండువా కప్పుకోవడం జేఎంఎంకు ఎదురుదెబ్బగా మిగిలింది. ఆదివాసీ ప్రాంతాల్లో చంపాయీకి ఉన్న ప్రజాదరణ ఆ వర్గం ఓట్లను చీలుస్తుందని, అది జేఎంఎం-కాంగ్రెస్ కూటమిపై ప్రభావం చూపిస్తుందని భావించినప్పటికీ ఫలితాలు వేరుగా వచ్చాయి.

**సూపర్ హిట్ జోడీ..** హేమంత్ అరెస్టు నేపథ్యంలో ఆయన సతీమణి కల్పనా సోరెన్ పార్టీలో కీలకంగా వ్యవహరించారు. అదే సమయంలో గాండేయ్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉపఎన్నికలో గెలుపొంది తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా విస్తృత పర్యటనలు చేస్తూ భాజపాపై తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తూ ప్రజల్లోకి చొచ్చుకుపోయారు. అనతి కాలంలోనే రాష్ట్ర రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకునే ప్రయత్నం చేశారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తర్వాత హేమంత్, కల్పనాలు కలిసి దాదాపు 200 సభల్లో పాల్గొనడం విశేషం. 'బంటీ ఔర్ బబ్లీ'గా పేరొందిన వీరిద్దరి జోడీ రాష్ట్ర రాజకీయాల్లో ఆకర్షణగా నిలిచింది.

**కాంగ్రెస్ కంగుతిన్నప్పటికీ..!...** మొత్తం 81 స్థానాలకు గాను జేఎంఎం 43 చోట్ల పోటీ చేయగా.. 33 స్థానాల్లో ఆధిక్యం సాధించింది. కాంగ్రెస్ 30 చోట్ల పోటీ చేసినప్పటికీ 16 స్థానాలకే పరిమితమైంది. కూటమిలో ఉన్న ఆర్జేడీ, సీపీఐ(ఎంఎల్)లు ఏడు చోట్ల ఆధిక్యంలో ఉన్నాయి. ప్రధాన భాగస్వామిగా ఉన్న కాంగ్రెస్ ఆశించిన మేర ఫలితాలు సాధించనప్పటికీ జేఎంఎం మాత్రం మెరుగైన ఫలితాలు సాధించింది. రాష్ట్రంలో 28 స్థానాలు ఎస్టీలు, తొమ్మిది ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాలుండటం ఆ పార్టీకి కలిసొచ్చినట్లు తెలుస్తోంది.



## నిరంతర అభివృద్ధే మహాయుతికి మళ్లీ పట్టం కట్టింది: గడ్కరీ

దిల్లీ: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో మహాయుతి కూటమి దూసుకుపోతోంది. ప్రతిపక్ష మహావికాస్ అఘాడీ ఎలాంటి పోటీ ఇవ్వలేకపోయింది. ఈ నేపథ్యంలో భాజపా సీనియర్ నేత, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ స్పందించారు. మహాయుతి కూటమి నేతలందరికీ అభినందనలు తెలిపారు. ప్రధాని మోదీ నాయకత్వంలో మహారాష్ట్ర అభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చిందని, అందుకే మహారాష్ట్ర ప్రజలు మరోసారి పట్టం కడుతున్నారని అన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు. " మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతికి చరిత్రాత్మక విజయం కట్టబెడుతున్న ప్రజలందరికీ హృదయపూర్వక అభినందనలు. ప్రజల ఆకాంక్షలకు కట్టుబడి, మహారాష్ట్ర సమగ్ర పురోగతికి ప్రధాని మోదీ నాయకత్వంలో ఎన్డీయే ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుంది" అని గడ్కరీ పేర్కొన్నారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతో రాష్ట్రాభివృద్ధి మరింత ఉన్నత స్థాయికి చేరుతుందని అన్నారు. ఇంతటి ఘనవిజయం కోసం శ్రమించిన ప్రధాని నరేంద్ర మోదీ, భాజపా జాతీయ అధ్యక్షుడు నడ్డా, సీఎం ఏక్‌నాథ్ శిందే, డిప్యూటీ సీఎం ఫడణవీస్, ఎన్సీపీ అధినేత అజిత్ పవార్, భాజపా, మహాయుతి నేతలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

# రేవంత్ సర్కార్ గుడ్ న్యూస్..




## త్వరలోనే ఖాతాల్లోకి రూ.30 కోట్లు

హైదరాబాద్ : తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోంది. ఏడాది పాలనలో అనేక పథకాలను, హామీలను నెరవేర్చిన ప్రభుత్వం ఆ దిశగా ముందుకు వెళుతోంది. ముఖ్యంగా మహిళల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి పెడుతోంది. ఇప్పటికే మహిళలకు ఫ్రీ బస్ పథకంతో ఎంతో మందికి ఆసరాగా నిలుస్తున్న సంగతి తెలిసిందే.

కాగా ఏడాది పాలన పూర్తి చేసుకోబోతున్న తరుణంలో మహిళలకు సర్కార్ మరో గుడ్ న్యూస్ చెప్పింది. బ్యాంకుల నుండి మహిళా స్వయం సహాయక సంఘాలు తీసుకున్న వడ్డీ లేని రుణాలకు ప్రభుత్వం మిత్తి డబ్బులు విడుదల చేసింది. ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించి మొత్తం రూ.30.70 కోట్లను విడుదల చేసింది. త్వరలోనే డబ్బులు మహిళా సంఘాల ఖాతాల్లో జమ కానున్నాయి. ఈ మొత్తంలో అత్యధికంగా నల్గొండ జిల్లాలో 5,283 సంఘాలకు రూ.1.99 కోట్లు వెళ్లనున్నాయి. అదేవిధంగా నిజామాబాద్ జిల్లాలో 50,10 గ్రూపులు ఉండగా రూ.1.91 కోట్లు వారి ఖాతాల్లోకి వెళ్లనున్నాయి. ఖమ్మంలో 3,983 సంఘాలు ఉండగా రూ.1.66 కోట్లు జమ చేయనున్నారు. కరీంనగర్ జిల్లాలో 3,983 గ్రూపులు ఉండగా రూ.1.55 కోట్లు ఆ సంఘాల ఖాతాల లోకి చేరనున్నాయి. మిగిలిన డబ్బులు ఇతర జిల్లాల మహిళా సంఘాల ఖాతాల్లోకి చేరనున్నాయి. దీంతో మహిళలకు ఎంతో లబ్ధి చేకూరనుంది. డ్వాక్రా సహా ఇతర సహాయక సంఘాల మహిళలకు మేలు జరగనుంది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏళ్లుగా మహిళా స్వయం సహాయక సంఘాలు తీసుకున్న వడ్డీలేని రుణాలకు మిత్తి డబ్బులు ఇవ్వలేదు.
దీంతో మహిళలు కొత్త రుణాలు తీసుకునేందుకు బ్యాంకులు ఇబ్బంది పెడుతున్న ఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ముందు మిత్తి డబ్బులు చెల్లించాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.

## సంపాదకీయం

### 'ఒరెష్నిక్' క్షిపణికి భయపడుతున్న ఉక్రెయిన్..

# ఎందుకు?

వారాల్లో ముగిసిపోతుందని భావించిన రష్యా –ఉక్రెయిన్ యుద్ధం చూస్తుండగానే నెలలు దాటేసి.. రెండేళ్లకు పైనే కావొస్తుంది. విపరీతమైన ప్రాణ నష్టం.. కోలుకోలేనంత ఆస్తినష్టంతో పాటు.. తాజాగా చోటు చేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో మూడో ప్రపంచ యుద్ధం దిశగా అడుగులు పడుతున్నాయా? అన్న సందేహంతో పాటు.. అమెరికాలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో రష్యాకు ఒళ్లు మండి అణ్వస్త్ర క్షిపణిని ప్రయోగిస్తే తమ పరిస్థితేంటి? అన్నదిప్పుడు ప్రశ్నగా మారింది. అమెరికా అండతో ఇటీవల ఉక్రెయిన్ జరిపిన క్షిపణి దాడికి ప్రతిగా రష్యా ప్రయోగించిన క్షిపణి కొత్త చర్చకు తెర తీసింది. అంతకంతకూ ముదురుతున్న యుద్ధం నేపథ్యంలో రష్యా తమపై ఖండాంతర క్షిపణితో దాడి చేసిందని ఉక్రెయిన్ చెబుతుంటే.. తాము అలాంటి పనేమీ చేయలేదని పుతిన్ ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. ఇంతకూ ఉక్రెయిన్ అంతలా ఆందోళన చెందుతున్న ఒరెష్నిక్ క్షిపణి కథాకమామీషు లెక్కేంటి? దాని పవర్ ఏంటి? ఉక్రెయిన్ వణుకు వెనుకున్న కారణాలేంటి? అన్న వివరాల్లోకి వెళితే.. విషయం ఇట్టే అర్థమవుతుంది. ఒరెష్నిక్ రష్యా డెవలప్ చేసిన ఖండాంతర క్షిపణి. అమెరికా.. బ్రిటన్ దేశాల అండతో ఉక్రెయిన్ చెలరేగిపోయి తమపై విరుచుకుపడితే.. దానికి బదులు తీర్చుకోవటానికి రూపొందించిన క్షిపణే ఒరెష్నిక్. రష్యాలో దొరికే హేజెల్ నట్ డ్రైఫ్రూట్ మొక్క పేరుతో ఈ క్షిపణికి ఒరెష్నిక్ పేరును పెట్టారు. ఈ హైపర్ సోనిక్ బాలిస్టిక్ మిసైల్ స్థాయిలోకి వెళితే.. ధ్వని వేగం కంటే 10 రెట్ల ఎక్కువ వేగంతో ప్రయాణిస్తుంది. ఈ కారణంగా ఈ క్షిపణిని ఒకసారి ప్రయోగించిన తర్వాత దాన్ని అడ్డుకోవటం అంత సులువైనది కాదని చెబుతారు. ఈ క్షిపణి సామర్థ్యం ప్రకారం చూస్తే.. 5 వేల కిలోమీటర్ల లోపు ఉన్న లక్ష్యాల్ని ఈ మిస్సైల్ అత్యంత కచ్చితత్వంతో ఛేదిస్తుంది. అంతేకాదు.. ఒకేసారి ఈ క్షిపణిని ప్రయోగించే వేళలో.. పలు లక్ష్యాల్ని ఛేదించేందుకు వీలుగా వీటికి వార్ హెడ్ లను డెవలప్ చేసినట్లుగా చెబుతారు. ఒకే సమయంలో ఆరు నుంచి 8 వరకు న్యూక్లియర్ లేదంటే కన్వెన్షనల్ వార్ హెడ్ లను మోసుకెళ్లే సామర్థ్యం వీటికి ఉందని చెబుతారు. రష్యా తమపై ప్రయోగించింది ఖండాంతర క్షిపణిగా ఉక్రెయిన్ వాదిస్తుందంటే.. అదేమీ కాదని.. రష్యా ప్రయోగించిన క్షిపణి మధ్యంతర శ్రేణి క్షిపణి కాదంటూ అమెరికా రక్షణ శాఖ ఒక ప్రకటన జారీ చేసింది. ఉక్రెయిన్ మీద రష్యా ప్రయోగించింది రూబెజ్ ఇంటర్ కాంటినెంటల్ బాలిస్టిక్ మిసైల్ గా పేర్కొంది. దీన్ని ప్రయోగించటానికి ముందే తమకు ఆ సమాచారం ఉందని అగ్రరాజ్యం పేర్కొంది. ఉక్రెయిన్ లోని పలు భాగాలు రష్యా సరిహద్దు నుంచి చాలా దగ్గరగా ఉన్న వేళలో.. ఖండాంతర క్షిపణులను ప్రయోగించాల్సిన అవసరం ఏముంది? అంటూ రష్యా వాదిస్తోంది. ఏమైనా.. యుద్ధం తీవ్రతరం అయ్యే కొద్దీ.. యుద్ధ ముప్పు ఉక్రెయిన్ తో పాటు.. దాని మిత్రపక్షాలను వెంటాడుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రానున్న రోజుల్లో మరేం జరుగుతుందో చూడాలి.

# సౌకర్యాల కల్పన.. రైతన్నకు సాంత్వన



వికారాబాద్ : ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం సన్నాహక చర్యలు చేపట్టింది. మిగతా జిల్లాల కంటే వికారాబాద్ జిల్లాలో వరి పంట 20 రోజుల ఆలస్యంగా చేతికొస్తుంది. ప్రభుత్వ ఆదేశాలతో అన్నదాతలు దళారులను ఆశ్రయించకుండా ఈనెల 3వ వారంలో కేంద్రాల ఏర్పాటుకు జిల్లా పౌర సరఫరాల శాఖ యంత్రాంగం కసరత్తు చేస్తోంది. కేంద్ర మద్దతు ధరను చెల్లించేలా చర్యలు తీసుకోనుంది. ఇప్పటికే మద్దతు ధరల గోడ పత్రికలను జిల్లా ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేశారు. ధాన్యం ముందుగా వచ్చే మండలాల్లో కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ నేపథ్యంలో గతంలో ఆయా కేంద్రాల వద్ద రైతులకు ఎదురైన సమస్యలు, కేంద్రాల్లో ఏర్పాటుచేయాల్సిన సౌకర్యాలపై కథనం.

**దెబ్బతీసిన వర్షాలు**

జిల్లాలో ఈ ఏడాది వానాకాలంలో 1.30 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. ఈసారి ఖరీఫ్‌కు సంబంధించి వర్షాలు సకాలంలో కురవలేదు. రైతులు బోర్లు, బావుల కింద పండించేందుకు యత్నించారు. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కురిసిన అకాల భారీ వర్షాలతో పలుచోట్ల తెగుళ్లు సోకాయి. ఫలితంగా గతంలో కంటే దిగుబడి తగ్గనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి 107 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. వీటి ద్వారా 100 శాతం మేర ధాన్యాన్ని కొనుగోలు చేస్తారు.

**సరిహద్దుల్లో చెక్‌పోస్టుల ఏర్పాటు**

ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం విక్రయానికి రాకుండా సరిహద్దు చెక్‌పోస్టులు ఏర్పాటు చేయనున్నాం. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు కనీస మౌలిక సదుపాయాలను కల్పించాలని అధికారులను ఆదేశించాం.

లింగ్యానాయక్, అదనపు కలెక్టర్.

**ఇలా చేయాలి**

కొనుగోలు కేంద్రాల వద్ద మంచినీటి సదుపాయం కల్పించాలి.
తూకాల్లో మోసాలను అరికట్టాలి.
నిర్దేశించిన దానికంటే ఎక్కువ మొత్తంలో తూకం వేయకూడదు.
కేంద్రం వద్ద ధాన్యం బస్తాలు ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా చూడాలి.
అవసరమైతే రక్షణ కోసం టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి.
గన్నీ బస్తాల కొరత ప్రతిసారీ రైతులను ఇబ్బందులకు గురిచేస్తోంది. డిమాండ్‌కు సరిపడా పంపిణీ చేయాలి.
ధాన్యం విక్రయించిన అనంతరం కనీసం 48గంటల్లో ఖాతాల్లో నగదు జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలి.
విక్రయాల్లో ఇబ్బందులు రాకుండా ఉండేందుకు కేంద్రాల వద్ద ఏఈఓలు అందుబాటులో ఉండాలి.

**మద్దుతు ధరలు... (రూ.క్వింటాలుకు)**

ఎ గ్రేడ్ రకం.. 2320
సాధారణ రకం.. 2300
సన్నరకానికి బోనస్ రూ.500

**ఖరీఫ్ సాగు.. (ఎకరాలు)**

సాధారణ.. 99,000
సాగైంది.. 85,000
దిగుబడి అంచనా.. లక్ష మెట్రిక్ టన్నులు

# గృహ లబ్ధికి ఇందిరమ్మ కమిటీలు



వికారాబాద్ : నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు సర్కారు చర్యలు చేపడుతోంది. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఒక్కో నియోజక వర్గానికి 3500 ఇళ్ల కేటాయించనున్నారు. ఈ పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు మూడు దశల్లో రూ.5 లక్షలు చెల్లిస్తారు. దీనికోసం ప్రత్యేకంగా గ్రామాలు, పట్టణాల్లో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. వీటిలోని సభ్యులు, అధికారులు సంయుక్తంగా లబ్ధిదారులను గుర్తిస్తారు. ఇందిరమ్మ కమిటీల నియమాకానికి గ్రామ సభలు, పట్టణాల్లో వార్డు సభలు నిర్వహిస్తారు.

వీరికి స్థానం కల్పిస్తారు: జిల్లాలో నాలుగు నియోజకవర్గాలు, 566 గ్రామ పంచాయతీలున్నాయి. తొలి విడతలో భాగంగా జిల్లాకు 14 వేల ఇళ్లు మంజూరు చేస్తారు. పంచాయతీలు, నాలుగు మున్సిపాలిటీల్లో వార్డు కమిటీల నియామకానికి అధికారులు కార్యాచరణ చేపడుతున్నారు.

పంచాయతీ పాలక వర్గాల గడువు ముగిసింది. దీంతో గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. సర్పంచ్‌ల స్థానంలో ప్రత్యేకాధికారికి ఇందిరమ్మ కమిటీలో చోటు కల్పించారు. ఇద్దరు మహిళా సంఘాల సభ్యులు, ముగ్గురు గ్రామస్థులు బీసీ, ఎస్సీ, ఎస్టీలలో ఒకరు చొప్పున పంచాయతీ కార్యదర్శి గ్రామ కమిటీలో భాగస్వామ్యం అవుతారు.

పురపాలిక సంఘాల పరిధిలో వార్డు కౌన్సిలర్, ఇద్దరు మహిళా పొదుపు సంఘాల సభ్యులు, బీసీ, ఎస్సీ, ఎస్టీల్లో ఒకరు చొప్పున సభ్యులుగా ఉంటారు. ఎవరైనా అనర్హులు ఎంపికై బిల్లులు తీసుకుంటే వారిపై ఫిర్యాదు చేసి నిధులు రాబట్టే అధికారం వీరికి ఉంటుంది.

**అన్నీ పారదర్శకంగా సాగుతాయి: రాకేశ్‌రెడ్డి, ఇన్‌ఛార్జి కమిషనర్, వికారాబాద్**

ఇళ్లకు సంబంధించిన పనులన్నీ పారదర్శకంగా సాగుతాయి. వికారాబాద్ పురపాలిక సంఘంలో ఇందిరమ్మ కమిటీ సభ్యుల ఎంపిక చేస్తున్నాం. వార్డుకు 7 మంది సభ్యులతో కమిటీ నియమిస్తాం. వార్డులన్నింటిలో కమిటీలను ఏర్పాటు చేస్తాం.

జిల్లాలో గ్రామ పంచాయతీలు: 566
ఒక్కో గ్రామ కమిటీలో సభ్యులు.. 7
మొత్తం సభ్యులు .. 3,962
4 పురపాలికల వార్డు కమిటీల్లో సభ్యులు : 679
గ్రామాల్లో 566 పట్టణాల్లో 97

**ఇవీ నిబంధనలు**

పేద మధ్య తరగతి వారై ఉండాలి.
జాతీయ ఆహార భద్రత కార్డు తప్పనిసరి.
అద్దె ఇళ్లలో నివసిస్తున్న వారికి ప్రాధాన్యం.
ఒంటరి మహిళలు, వితంతువులకు అవకాశం.
సొంత ఇంటి జాగా కలిగి ఉండాలి.

# బ్యాలెట్ పెట్టెలు సిద్ధమేనా?

పెద్దపల్లి : పంచాయతీ ఎన్నికల్లో కీలకమైనా బ్యాలెట్ పెట్టెలపై అధికారులు దృష్టి సారించారు. రాష్ట్ర ప్రభుత్వం మరో రెండు నెలల్లోపు పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఇప్పటికే ఓటరు జాబితా సిద్ధం చేసిన అధికార యంత్రాంగం జిల్లా కేంద్రాల్లోని గోదాంలలో భద్రపరిచిన బ్యాలెట్ పెట్టెలను సరి చూస్తున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించి ఆరేళ్లు సమీపిస్తుండటంతో వీటిలో ఏమైనా లోపాలు ఉన్నాయా? చెడిపోయయా? అనేది తేల్చే పనిలో ఉన్నారు. చిన్న చిన్న మరమ్మతులు ఉంటే చేస్తున్నారు. పెరగనున్న వార్డులు 2018–19 పంచాయితీ ఎన్నికలను పరిశీలిస్తే ఉమ్మడి జిల్లాలో 1,214 గ్రామ పంచాయతీల్లో 11,132 వార్డులున్నాయి. ప్రతి వార్డులో 250 ఓటర్లు ఉంటారు. ఎన్నికల్లో వార్డుకొక బ్యాలెట్ పెట్టె అవసరం కానుంది. ఇటీవల ప్రకటించిన తుది జాబితాలో ఓటర్ల సంఖ్య పెరగడంతో ఉమ్మడి జిల్లాలో వార్డుల సంఖ్య పెరగనుంది. జిల్లాల వారీగా పెరిగిన ఓటర్ల ఆధారంగా వార్డుల లెక్కలను కొలిక్కి తేనున్నారు. దీంతో అధికారులు ఇప్పటి వరకు అందుబాటులో ఉన్న బ్యాలెట్ పెట్టెలు ఎన్ని? చెడిపోయిన ఎన్ని? అని తనిఖీ చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలకు తీసుకెళ్లిన బ్యాలెట్ పెట్టెలపై ఆరా తీస్తున్నారు. వీటిని తిరిగి తీసుకొచ్చేందుకు ప్రభుత్వానికి నివేదించనున్నారు. బ్యాలెట్ పెట్టెలు పక్కదారి పక్కకుండా ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ కొనసాగుతోంది. ఎన్నికల ప్రకటన లోపు అన్ని ఏర్పాటు సిద్ధం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.




రిజర్వేషన్లపై వీడని ఉత్కంఠ గత భారాస ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన కొత్త పంచాయతీరాజ్ చట్టం ప్రకారం పదేళ్ల పాటు పంచాయతీ రిజర్వేషన్లు ఉంటాయి. అయితే ప్రస్తుత ప్రభుత్వం అదే చట్టాన్ని కొనసాగిస్తుందా? కొత్త రిజర్వేషన్లు తీసుకొస్తుందా? అన్న దానిపై ఉత్కంఠ వీడటం లేదు. ఓ వైపు బీసీ కులగణన చేయాలని సంబంధ సంఘాల నేతలు పట్టుబట్టడంతో ప్రభుత్వం సర్వే చేయాలని ఆదేశించింది. మరోవైపు ఎస్సీ వర్గీకరణ చేసే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ఆయా వర్గాల వారు డిమాండ్ చేస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో అన్నది ఆసక్తికరంగా మారింది.

## సీసీ కెమెరాలను ప్రారంభించిన పెట్ బషీరాబాద్ ఏసిపి రాములు

శామీర్ పేట, (గరుడ వార్త) : సీసీ కెమెరాలతో నేరాలు ఛేదించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తోందని పెట్ బషీరాబాద్ ఏసీపీ రాములు అన్నారు. మండల కేంద్రం శామీర్ పేటలో శ్రీ రామాలయం లో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ సిసి కెమెరాలు అందుబాటు ధరల్లో లభిస్తున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరు సెల్ ఫోన్లు వాడినట్లుగా తమ ఇంటి వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సిసి కెమెరాలతో





నేరాలను నియంత్రించవచ్చని చెప్పారు. గ్రామాల్లోజరిగే చోరీలు, రోడ్డు ప్రమాదాలు వంటి వాటి వల్ల నేరస్తులను త్వరగా పట్టుకొని శిక్షించవచ్చన్నారు. తమ తమ గ్రామాల్లో గ్రూపులుగా ఏర్పాటు చేసుకొని బస్తీ మొత్తం కవర్ అయ్యేలా సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట ఎస్ఐలు హారిక, దశరథ్, శామీర్ పేట కట్టమైసమ్మ ఆలయ కమిటీ ఛైర్మన్ అశోక్, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండబోతోంది

శామీర్ పేట (గరుడ వార్త) : పలు ప్రాంతాల్లో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండబోతోందని అలియాబాద్ ఏ ఈ వెంకటనారాయణ ఓ ప్రకటనలో శనివారం పేర్కొన్నారు. ఆదివారం తుర్కపల్లి పరిధిలోని ఐసిఐసిఐ నాలెడ్జ్ పార్క్ విద్యుత్ సబ్ స్టేషన్ లో ఎస్ పి–1, భారత్ బయోటెక్, ప్రజయ్ ఫీడర్ల మరమ్మత్తుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో



అంతరాయం ఉంటుందని తెలిపారు. ఈ ఫీడర్ల మరమ్మతుల కారణంగా జీనం వ్యాలీ పరిశ్రమలు, డొమెస్టిక్, కమర్షియల్, ప్రజయ్ వాటర్ ప్లాంట్, మురహారి పల్లి ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చెప్పారు. ఈ విషయం విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఏఈ కోరారు.

## శామీర్ పేట పెద్ద చెరువులో శ్రమదానం చేసిన ఎన్ సి సి విద్యార్థుల

శామీర్ పేట, (గరుడ వార్త) : ఎన్ సి సి దినోత్సవం పురస్కరించుకొని శామీర్ పేట పెద్ద చెరువులో విద్యార్థులు పెద్ద ఎత్తున శ్రమదానం నిర్వహించి పరిసరాలను శుభ్రం చేశారు. శనివారం శ్రీనిధి ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన ఎన్ సి సి విద్యార్థులు శామీర్ పేట పెద్ద చెరువులో శ్రమదానం చేసి పరిసరాలను శుభ్రపరచారు. ఈ శ్రమదానంలో కట్టమైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్ అశోక్ తో పాటు కమిటీ సభ్యులు శ్రమదానం చేశారు. ఈ కార్యక్రమంలో





తూముకుంట మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్, అసోసియేట్ ఎన్ సి సి ఆఫీసర్ ప్రవీణ్, ఎన్ సి సి స్టూడెంట్ హెడ్ భార్గవి జోషి, మున్సిపల్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీజేపీ నాయకుల విజయోత్సవ సంబరాలు

శామీర్ పేట, (గరుడ వార్త) : మహారాష్ట్రలో బీజేపీ భారీ మెజార్టీతో గెలుపొందడంతో బీజేపీ నాయకులు తుర్కపల్లిలో విజయోత్సవ సంబరాలు జరుపు కొన్నారు. మహారాష్ట్రలో జరిగిన ఎన్నికల ఫలితాల్లో శనివారం బారీ మెజార్టీతో బీజేపీ గెలుపొందడంతో శామీర్ పేట మండలం తుర్కపల్లి గ్రామంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు విజయోత్సవ ర్యాలీ నిర్వహించి బాణాసంచా పేల్చి, స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో మహారాష్ట్రలో విజయకేతన్ ఎగిరేసిన ఆనందంతో స్వీట్లు పంచుకున్నారు. ఈ



కార్యక్రమంలో శక్తి కేంద్రం ఇంచార్జ్ నిరుడు అశోక్, భూత్ అధ్యక్షుడు కే శ్రీనివాస్, నాయకులు కే సత్యనారాయణ, బి శివరాజయ్య, దుర్గాప్రసాద్, యాదగిరి, నర్సింగ్, నరేందర్, శ్రీధర్ గౌడ్, కే నర్సింగ్, శ్రీకాంత్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# నమ్ము.. ఇది కొత్త వంతెనపై దుమ్ము

రామడుగు: రామడుగులోని మోతెవాగు కొత్త వంతెనపై 'దుమ్ము' సమస్యగా మారింది. పాత వంతెన గత వర్షాకాలంలో భారీ వరదలకు కొట్టుకుపోవడంతో సెప్టెంబరు 5న కొత్త వంతెనను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. వంతెనకు ఇరువైపులా చేపట్టిన భూసేకరణకు పరిహారం చెల్లించలేదు. రాకపోకలు స్తంభించడంతో బాధిత రైతులను ఒప్పించి వంతెనకు రెండు వైపులా మొరం నింపి తాత్కాలిక దారి ఏర్పాటు చేశారు. రూ.11.20 కోట్లతో సవరణ ప్రతిపాదనలతో శాశ్వత ప్రాతిపదికన ఇరువైపులా తారు రోడ్డు వేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. రెండున్నర నెలలు గడుస్తున్నా అడుగు ముందుకు పడలేదు.

**రక్షణ గోడలు లేక ప్రమాదకరంగా...**

సుమారు రెండున్నర మీటర్ల ఎత్తులో మొరం పోసి తాత్కాలిక రహదారి ఏర్పాటు చేశారు. దానిపై నుంచి నిత్యం భారీ వాహనాలు వెళుతుండటంతో దుమ్ము లేస్తోంది. ద్విచక్రవాహనదారుల కళ్లలో దుమ్ము పడుతోంది. దారి కనిపించక ఇబ్బందులు పడుతున్నారు. ముక్కు ద్వారా ఊపిరితిత్తుల్లోకి దుమ్ము వెళ్తోంది. ఇరువైపులా అడుగడుగునా గుంతలు ఏర్పడటంతో ద్విచక్ర వాహనాలు అదుపు తప్పడం సాధారణంగా మారింది. వంతెనకు రెండు వైపులా మట్టి ఎత్తుగా



పోసిన చోట రక్షణ గోడలు నిర్మించకపోవడంతో ప్రమాదకరంగా మారింది. ఇటీవల కారు అదుపుతప్పి పడిపోయింది. షానగర్ వైపు నుంచి వచ్చే వారి కోసం సూచికబోర్డు ఏర్పాటు చేయకపోవడంతో కొత్త మలుపు తెలియని వారు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కొత్త వంతెన వద్ద తారు రోడ్డు పనులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

**కళ్లలో పడుతోంది..**

రోజువారి అవసరాలకు రామడుగుకు వస్తుంటాం. కానీ కొత్త వంతెన వద్ద దుమ్ము సమస్యగా మారింది. భారీ వాహనం వెళ్లిన ప్రతిసారి కొత్త సేపటి వరకు దుమ్ము ఉంటుంది. ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కళ్లల్లో దుమ్ము పడితే ఇక వాహనాలు నిలిపివేయాల్సిందే. దారి కనిపించడంలేదు. సత్వరం కొత్త వంతెన వద్ద ఇరువైపులా తారు రోడ్డు వేయాలి.

పుల్కం రామజమల్లు, షానగర్

**ప్రమాదకరంగా గుంతలు..**

కొత్త వంతెన వద్ద గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఒక గుంతను తప్పించుకుంటే మరొకటి ఉంటుంది. రెండు వైపులా మొరం నింపడంతో బైకు కొంత వేగంగా వెళ్లినా జారుతోంది. జాగ్రత్తగా చూసుకొని వాహనం నడపాల్సి వస్తోంది. అధికారులు స్పందించి రోడ్డు బాగు చేయాలి.కొత్త రాజు, షానగర్

# సీసీఐ జోరు.. పెరిగిన పత్తి కొనుగోళ్లు

జమ్మికుంట: అంతర్జాతీయ మార్కెట్ ప్రభావం పత్తి ధరపై పడుతోంది. సీసీఐ మద్దతు ధర రూ.7,521 కంటే ప్రైవేట్ వ్యాపారులు సుమారు రూ.700 దాకా తక్కువకు కొనుగోలు చేయడంతో రైతులు సీసీఐకి విక్రయించేందుకు మొగ్గు చూపుతున్నారు. ఈనెల 11 నుంచి కొనుగోళ్లలో వేగం పెంచిన సీసీఐ.. జిల్లాలోని జమ్మికుంట ప్రధాన వ్యవసాయ మార్కెట్‌లో కేవలం వారం రోజుల్లోనే 7,109 క్వింటాళ్లను కొనుగోలు చేయటం విశేషం. గత రెండు రోజుల్లో స్థానిక మార్కెట్‌కు వచ్చిన యాభై శాతం ట్రాలీల పత్తిని సీసీఐ కొనుగోలు చేసింది.



**18 జిన్నింగ్ మిల్లుల నోటిఫై**

సీజన్ కంటే ముందస్తుగా కొత్త పత్తిని రైతులు విక్రయానికి తీసుకువస్తున్నా.. తేమ, నాణ్యత లేకపోవటంతో ప్రైవేట్ వ్యాపారులు మద్దతు ధరకు కొనుగోలు చేయడంలేదు. దీంతో పత్తిని మద్దతు ధరకు ఖరీదు చేసేందుకు సీసీఐ ఉమ్మడి జిల్లాలో 18 జిన్నింగ్ మిల్లులను నోటిఫై చేసింది. జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కు గత సెప్టెంబర్ 13 నుంచే కొత్తపత్తిని రైతులు విక్రయానికి తీసుకొస్తున్నారు. మొదట్లో ద్వితీయ శ్రేణి వ్యాపారులు పత్తిని తక్కువ ధరకు కొనుగోలు చేశారు. దసరా తర్వాత పలువురు జిన్నింగ్ మిల్లుల వ్యాపారులు కొనుగోళ్లను చేపట్టినా మద్దతు ధరను అందించలేదు. సీసీఐ నిబంధనలను సడలించటంతో కొనుగోళ్లు పెరిగాయి.

**గతేడాదితో పోలిస్తే..**

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇప్పటివరకు 36,148 క్వింటాళ్ల పత్తికి సీసీఐ మద్దతు ధర చెల్లించింది. జిల్లాలో 17,450 క్వింటాళ్లకు ఖరీదు చేసింది. స్థానిక ఆరు నోటిఫై జిన్నింగ్ మిల్లుల్లోనే వారం రోజులుగా 15 నుంచి 35 ట్రాలీల దాకా సీసీఐ కొనుగోలు చేసింది. గత సీజన్‌లో జిల్లాలో ఇదే సమయానికి 3,326 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయగా.. పెద్దపల్లి మార్కెట్‌లో కేవలం 194 క్వింటాళ్లను సీసీఐ ఖరీదు చేసింది.

**రూ.7,471 కు విక్రయించాభాగ్య, రైతు, రాచపల్లి**

ప్రైవేట్ వ్యాపారులు పత్తికి తక్కువ ధర చెల్లించడంతో.. జమ్మికుంటలోని నోటిఫై జిన్నింగ్ మిల్లు కేంద్రానికి విక్రయానికి తీసుకొచ్చా. నాణ్యతను పరిశీలించి.. క్వింటాలుకు రూ.7,471 ధర నిర్ణయించారు. ప్రైవేట్ కంటే అధిక ధర చెల్లించడంతో సంతోషంగా ఉంది.

**సీసీఐకి విక్రయించేందుకు ఆసక్తి**

మద్దతు ధర కంటే పత్తికి ప్రైవేట్ వ్యాపారులు తక్కువ ధర నిర్ణయించడంతో జమ్మికుంట మార్కెట్‌లో సీసీఐకి విక్రయించేందుకు రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. నాణ్యత లేకపోవటం, అంతర్జాతీయ మార్కెట్ ప్రభావం, పత్తి గింజల ధర తగ్గుదలతో ప్రైవేట్ వ్యాపారులు ధరను తగ్గిస్తున్నారు. ఆర్.మల్లేశం, ఉన్నత శ్రేణి కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ జమ్మికుంట

# వసూళ్లపై గురి... బండెళ్లే దారేదీ..?



హైదరాబాద్ : నగరంలో 80 లక్షల వాహనాలున్నాయి. వాటికి అదనంగా నిత్యం 2 నుంచి 3 వేల వాహనాలు కొత్తగా రోడ్లపైకి చేరుతున్నాయి. నగరంతో పాటు ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే 20-25లక్షల వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయి. ఇంతటి ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు, ప్రయాణం సాఫీగా సాగేందుకు అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అధికారులు ఉదాసీనంగా ఉంటున్నారనే విమర్శలున్నాయి. మెగాసిటీ పోలీసింగ్‌లో భాగంగా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లను 18 నుంచి 31కు పెంచారు. అదనపు సిబ్బందిని కేటాయించారు. అయినా ట్రాఫిక్ స్తంభనలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. కొందరు ఇన్‌స్పెక్టర్లు, ఎస్పైలు విధినిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఓ ఉన్నతాధికారి పేర్కొనడం పరిస్థితి తీవ్రతకు అద్దంపడుతోంది.

**ఆదేశాలు ఘనం.. ఆచరణ శూన్యం**

నగరంలో ట్రాఫిక్ తీరు గందరగోళంగా తయారైంది. దారిన పెట్టాల్సిన యంత్రాంగం నిర్లక్ష్యం. నెలవారీ మాముళ్లకు అలవాటుపడిన కొందరు అధికారుల తీరుతో ట్రాఫిక్ విభాగం గాడితప్పింది. క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాల్సిన ట్రాఫిక్ అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. హెూంగార్డులపై భారమేసి చేతులు దులుపుకొంటున్నారు. ఆపరేషన్ రోప్‌ను కచ్చితంగా అమలు చేయమని నగర సీపీ సీవీ ఆనంద్ జారీ చేసినఆదేశాలు అమలుకు నోచుకోవడం లేదు. పద్ధతి మార్చుకోవాలని, దిద్దుబాటు చర్యలు చేపట్టమని హెచ్చరించినా పరిస్థితిలో మార్పు లేదు.

**ఎవరి లెక్కలు వారివే..**

ఓ ఏసీపీ తోపుడుబండ్లు, హెూటల్ నిర్వాహకుల నుంచి ముక్కుపిండి మరీ కావాల్సినంత వసూలు చేస్తున్నారని తెలిసింది. మరో ఏసీపీ హాకర్లను భయపెట్టే బాధ్యత ఆయా సెక్టార్ల ఎస్పైలకు అప్పగించారన్న ఆరోపణలున్నాయి. ఫొటో తీసి కేసు నమోదు చేస్తామని బెదిరిస్తూ నెలవారీ లక్ష్యాన్ని పూర్తిచేస్తున్నారు. మరో ఏసీపీ తన పరిధిలో తెల్లవారుజాము వరకూ నడిపించే ఐస్‌క్రీమ్‌పార్లర్, హెూటల్ నుంచి ప్రతినెలా రూ.లక్షన్నర తీసుకుంటున్నట్లు సమాచారం. ఒక ఇన్‌స్పెక్టర్ పైవాళ్లకు ఇవ్వాలంటూ భారీగా డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. మరో ఏసీపీ తోపుడుబండ్లు, వ్యాపార వర్గాల నుంచి డబ్బు వసూలు చేసే బాధ్యతను హెూంగార్డు, కానిస్టేబుల్‌కు అప్పగించడం చర్చనీయాంశంగా మారింది. ఆ ప్రాంతంలో అర్ధరాత్రి దాటేంత వరకూ హెూటళ్లు నిర్వహిస్తున్నా చూసీచూడనట్లు వదిలేస్తూ శాంతి భద్రతల సమస్యకు కారణమవుతున్నారు. ట్రాఫిక్ విభాగంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ముగ్గురు ఏసీపీలు, నలుగురు ఇన్‌స్పెక్టర్లు, మరో అధికారిపై అంతర్గత విచారణ జరుగుతున్నట్లు సమాచారం. వీరిలో ఇద్దరికి పలుమార్లు ఛార్జిమెమోలు జారీచేసినా తీరుమారక పోవడం గమనార్హం.

# అసంపూర్ణ సమీకృతం.. సమస్యలు నిత్యకృత్యం



పరిగి : ఒకే ప్రాంతంలో తాజా కూరగాయలు, పండ్లు, పాలు, ఇతర మాంసం ఉత్పత్తుల అమ్మకాలను నిర్వహించాలన్న ఉద్దేశంతో రెండేళ్ల క్రితం జిల్లాలో మున్సిపాలిటీల్లో చేపట్టిన సమీకృత మార్కెట్ల నిర్మాణ పనులు 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా ఉన్నాయి. ఇప్పటి వరకు కనీసం ఒక్కచోట కూడా పూర్తికాకపోవడంతో రైతులు, వినియోగదారులు పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీ కాదు. అమ్ముకునేందుకు ప్రత్యేక స్థలాలు కూడా లేకపోవడంతో ప్రతివారం విక్రయాల వద్ద రైతుల మధ్య సమస్యలు తలెత్తుతున్నాయి.

**రూ.22 కోట్ల అంచనా వ్యయం:** గత ప్రభుత్వం సుమారు రూ.22కోట్ల అంచనా వ్యయంతో పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్ మున్సిపల్ పట్టణ కేంద్రాల్లో నిర్మాణ పనులను అట్టహాసంగా ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు పనుల్లో మందగమనం వీడటం లేదు. ఆయా ప్రాంతాల్లో విధిలేక పండ్లు ఒకచోట, కూరగాయలు మరోచోట, మాంసం ఇంకో ప్రాంతంలో ఇలా విక్రయాలు నిర్వహిస్తున్నారు. పరిగి, తాండూరు తదితర ప్రాంతాల్లో రోడ్ల పైనే అమ్మకాలు కొనసాగిస్తున్నారు. దీంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నా తప్పడంలేదని రైతులే వాపోతున్నారు.

**జిల్లా కేంద్రంలో పిల్లర్లకే పరిమితం**

వికారాబాద్‌లో 108 దుకాణాలను ఏర్పాటు చేయాలని భావించినా పనులు పిల్లర్లకే పరిమితమయ్యాయి. పిచ్చి మొక్కలు మొలిచి ఆనవాళ్లు కోల్పోతోంది. జిల్లా కేంద్రం కావడంతో విక్రయాలు అధికంగా సాగుతాయి.కొడంగల్‌లో నాణ్యత లోపంతో మధ్యలోనే ఉన్నతాధికారులు పనులు ఆపేశారు. దీంతో రైతులు రోడ్లపైనే ఆధారపడుతున్నారు. తాండూరు వాణిజ్య పరంగా ఎదుగుతున్నా మౌలిక సదుపాయాల కల్పనలో మున్సిపాలిటీ వెనుకబడి ఉంది. వెరసి చిరు వ్యాపారులు రోడ్డుపైనే విక్రయించక తప్పడం లేదు

నిత్యం కూరగాయల విక్రయాలు (టన్నుల్లో) ఇలా..: తాండూరులో 18, పరిగిలో 5, వికారాబాద్‌లో 15, కొడంగల్‌లో 4 మేర జరుగుతున్నాయి. వీటికితోడు మార్కెట్ల వేలంపాటల ద్వారా మున్సిపాలిటీలకు రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతోంది.

**శ్లాబుతో ఆగిన పనులు**

పరిగిలోని పాత మార్కెట్ ప్రాంతంలో రూ.4కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణ పనులు ప్రారంభించారు. మొదిటి, రెండో అంతస్థుకు సంబంధించిన శ్లాబు పనులు పూర్తయ్యాయి. నిధుల కొరత కారణంగా బ్రేక్ పడింది. దీంతో కూరగాయల విక్రయాలు వ్యవసాయ మార్కెట్ యార్డు షెడ్డులోనూ, గంజ్‌రోడ్డులోనూ నిర్వహించాల్సి వస్తోంది.

నిధులు మంజూరు కావాల్సి ఉంది- వెంకటయ్య, కమిషనర్, పరిగి. సమీకృత మార్కెట్ నిర్మాణ పనులకు అదనపు నిధులు మంజూరు కావాల్సి ఉంది. ఈమేరకు ఇప్పటికే ఉన్నతాధికారులకు ప్రతిపాదించాం.

# తితరచూ దొరుకుతున్నా తగ్గేదేలే!

గోదావరిఖని: అంతర్గాం తహసీల్దారు కార్యాలయం అవినీతికి చిరునామాగా మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏడాదిన్నర కిందట ఇక్కడ పని చేసిన తహసీల్దారు భూమి హద్దుల విషయంలో డబ్బులు డిమాండ్ చేయడంతో బాధితుడు అనిశా అధికారులను సంప్రదించారు. అధికారి లంచం తీసుకుంటూ అనిశా అధికారులకు పట్టుబడ్డారు. తాజాగా ఇదే కార్యాలయంలోని తహసీల్దార్ రమేశ్ మంగళవారం లంచం డిమాండ్ చేసి అనిశాకు చిక్కారు.

**..అయినా మారని తీరు**

తహసీల్దార్ రమేశ్ అనిశా అధికారులకు చిక్కడం ఇది రెండోసారి. ఈ అధికారి వివిధ పనుల నిమిత్తం వచ్చే వారి నుంచి డబ్బులు డిమాండ్ చేస్తారని స్థానికంగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ధర్మారం మండలంలో పని చేస్తున్న సమయంలో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేసేందుకు రూ.10 వేలు లంచం డిమాండ్ చేయడంతో బాధితుల ఫిర్యాదు మేరకు అనిశా అధికారులు వల పన్ని పట్టుకున్నారు. తాజాగా అంతర్గాం మండలంలో ఇసుక ట్రాక్టర్ విడుదల చేసేందుకు రూ.12 వేలు అడగటంతో బాధితుడు అనిశాను ఆశ్రయించారు. ఆర్ఐ ద్వారా అవినీతి వ్యవహారాన్ని నడిపిస్తున్న క్రమంలో అనిశా అధికారులు దాడులు చేశారు. ఆ సమయంలో ఆర్ఐ అక్కడి నుంచి పారిపోగా తహసీల్దార్‌ను పట్టుకొని కేసు నమోదు చేశారు.

**బూడిద తరలింపులోనూ..!**

అంతర్గాం మండలం కుందనపల్లి బూడిద చెరువు నుంచి రవాణా చేసే లారీల నుంచి రూ.500 చొప్పున వసూలు చేయడం వివాదాస్పదమైంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టిప్పర్ల నుంచి వసూలు చేస్తున్నట్లు చెప్పుకున్న తహసీల్దార్ వాటికి ఎలాంటి రసీదు లేకుండా వీఆర్ఏల ద్వారా డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలున్నాయి. ఎన్ని లారీల నుంచి డబ్బులు వసూలు చేశారనే విషయమై ఎలాంటి లెక్కలు లేవు. ఇందులో తహసీల్దార్ భారీ మొత్తంలో అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ఎనిమిదేళ్లలో 16 మంది**

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్: జిల్లా ఆవిర్భావం తర్వాత గడిచిన ఎనిమిదేళ్లలో 16 మంది అనిశాకు పట్టుబడితే అందులో ఎనిమిది మంది రెవెన్యూ శాఖ ఉద్యోగులే. దస్త్రాల్లో పేరు మార్పిడి, హక్కుల బదలాయింపు, సర్వే నిర్వహణ, రిజిస్ట్రేషన్ల నమోదు, గుత్తేదారులకు బిల్లుల చెల్లింపు తదితర పనులు చేయడానికి లంచం డిమాండ్ చేస్తున్నారు.

2018లో మూడు కేసులు నమోదయ్యాయి. రామగుండంలో వీఆర్వోలు మహేందర్, మల్లేశం, పెద్దపల్లి మండలం కనగర్తి వీఆర్వో లింగస్వామి,



కాల్వశ్రీరాంపూర్‌లో వీఆర్వో కొమురయ్యలు పట్టుబడ్డారు. వీరంతా రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు డిమాండ్ చేసి అనిశాకు దొరికారు.

2019 నవంబరులో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు కృష్ణారెడ్డి ఎరువుల డీలర్ నుంచి రూ.10 వేలు తీసుకుంటూ చిక్కారు.

2019లో మిషన్ కాకతీయ కింద చెరువుల పూడికతీత పనులకు బిల్లుల మంజూరు కోసం గుత్తేదారు నుంచి నీటిపారుదల శాఖ పెద్దపల్లి డిప్యూటీ ఇంజనీర్ రవికాంత్ రూ.30 వేలు తీసుకుంటూ పట్టుబడ్డారు. : 2020 మార్చి 4న రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న భూమి దస్తావేజులు ఇచ్చేందుకు రూ.30 వేలు లంచం డిమాండ్ చేసిన సబ్ రిజిస్ట్రార్ ఎం.దిలీప్‌చంద్రగోపాల్, దస్తావేజు లేఖరి టి.వెంకట్‌లు అనిశాకు దొరికారు.

2021 సెప్టెంబరు 4న జిల్లా ఇన్‌ఛార్జి ముఖ్యప్రణాళికాధికారి వెంకటనారాయణ రామగుండం గుత్తేదారు బి.తిరుపతి నుంచి రూ.40 వేలు తీసుకుంటూ దొరికారు.

2021 నవంబరు 30న అప్పటి పెద్దపల్లి ఆర్డీవో, రామగుండం నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్ శంకర్ పారిశుద్ధ్య పనుల గుత్తేదారు నుంచి రూ.లక్ష లంచం తీసుకుంటూ అనిశాకు చిక్కారు.

2022 మే 23న పెద్దంపేటకు చెందిన భూమి సర్వే కోసం రైతు నుంచి రూ.లక్ష తీసుకుంటూ రామగుండం తహసీల్దార్ సంపత్ దొరికారు. నవంబరు 6న మంథనిలో విద్యుత్తు ట్రాన్సుఫార్మర్ కోసం దరఖాస్తు చేసుకున్న రైతు నుంచి రూ.20 వేలు తీసుకుంటూ ఏఈ రాజ్‌కుమార్ దొరికారు. ఇదే ఏడాది కాల్వశ్రీరాంపూర్ తహసీల్దారు కార్యాలయంలో ధరణి ఆపరేటర్ పట్టుబడ్డారు.

2023 ఫిబ్రవరి 23న పెద్దపల్లి సబ్‌రిజిస్ట్రార్ నిర్మల, అటెండర్ రూ.50 వేల లంచం తీసుకుంటూ అనిశాకు దొరికారు.

2024 ఆగస్టు 3న కాల్వశ్రీరాంపూర్ తహసీల్దార్ జాహేద్‌పాషా, ప్రైవేటు ఉద్యోగి ధర్మేందర్, డ్రైవర్ రూ.10 వేలు తీసుకుంటూ చిక్కారు.

# మత్తు వదిలిస్తారు!

సిరిసిల్ల : ఏటా ఎంతో మంది మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారు. బయటపడేందుకు మార్గాలు తెలియక మానసిక, శారీరక ఆరోగ్య సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. వైద్యసేవలు ఖర్చుతో కూడుకున్నవి కావడంతో బాధిత కుటుంబాలు కూడా మత్తుకు బానిసైన వారిని చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. ఈనేపథ్యంలో వ్యసనపరులను సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు టీజీ న్యాబ్ సిద్ధమైంది. ఇందులో భాగంగా సిరిసిల్లలో డీ అడిక్షన్ కేంద్రాన్ని పోలీసులు అందుబాటులోకి తీసుకొచ్చారు. బాధితులకు ఇక్కడ కౌన్సెలింగ్ ఇచ్చి సాధారణ స్థితికి వచ్చే విధంగా కృషి చేస్తున్నారు.

అందుబాటులో వైద్యుడు, మానసిక నిపుణుడు

సిరిసిల్ల పట్టణ పరిధిలో రాజీవ్‌నగర్‌లోని బస్తీ దవాఖానాలో జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలకు బానిసలైన వారికి సేవలు అందించేందుకు ఈ ఏడాది ఫిబ్రవరి 5న డీ అడిక్షన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో మానసిక నిపుణుడు, వైద్యులు అందుబాటులో ఉ




ంటారు.ప్రధానంగా మత్తు పదార్థాలకు, గంజాయికి బానిసై, తల్లిదండ్రులు చెప్పినా వినకుండా ఉండే యువతీ, యువకులను గుర్తించి వారికి ఈ కేంద్రంలో కౌన్సెలింగ్ ఇస్తారు. వారిని మత్తు పదార్థాలకు దూరం చేయడమే లక్ష్యంగా ఈ కేంద్రం పని చేస్తోంది.

యువత గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటు పడి ఉన్మాదిగా మారితే ఆ కుటుంబం వీధిన పడే అవకాశం ఉంటుంది. ఇలాంటి వారిని గుర్తించి సన్మార్గంలో నడిపించడానికి డీ అడిక్షన్ కేంద్రం ఎంతగానో దోహదపడనున్నదని పోలీసు అధికారులు చెబుతున్నారు. వ్యసనపరులకు మానసిక వైద్య నిపుణుడి ఆధ్వర్యంలో వారం రోజుల పాటు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. బలవర్ధక ఔషధాలను అందించి చికిత్స చేయనున్నారు. ఇప్పటి వరకు ఈ కేంద్రంలో నలుగురికి వైద్య సేవలు అందించగా వారు సాధారణ స్థితికి చేరుకుంటున్నారని వైద్య నిపుణులు తెలిపారు.

బాధితులు ఈ కేంద్రాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని వారి బంగారు భవిష్యత్తును తిరిగి చక్కదిద్దుకొనేందుకు ఇది ఉపయోగపడనున్నది.గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు సంబంధించి మెసేజ్ యువర్ ఎస్పీ వాట్సప్ నంబర్ 6303922572కు సమాచారం అందించవచ్చు. లేకుంటే టోల్ ఫ్రీ నంబరు 14416లో కూడా సంప్రదించవచ్చని టీజీ న్యాబ్ అధికారులు, పోలీసులు కోరుతున్నారు.

నరాల వ్యవస్థపై తీవ్ర ప్రభావం

మత్తు పదార్థాలు తీసుకుంటే నరాల వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఫలితంగా నరాలు ఉత్తేజాన్ని కోల్పోతాయి. సహజ మనస్తత్వాన్ని కోల్పోయి, ఉద్వేగభరితంగా వ్యవహరిస్తారు. మొదదులో కార్టిసోల్ అనే హార్మోన్స్ ప్రభావం, ఒత్తిడి వల్ల మళ్లీ మళ్లీ మత్తును తీసుకోవాలనే ఆలోచన రావడంతోపాటు వింతగా ప్రవర్తిస్తారు. ఊహాజనితంగా ప్రవర్తిస్తారు. వాహనాన్ని నడుపుతున్నప్పుడు ఎంత వేగంగా వెళ్లినా తక్కువగానే వెళ్తున్నట్లు భావిస్తారు. ఏది చేసినా అతిగా చేస్తారు.పున్నం చందర్, మానసిక నిపుణుడు

వ్యసనపరులకు కౌన్సెలింగ్ మత్తు పదార్థాలకు బానిసైన వారికి చికిత్స అందించేందుకు సిరిసిల్లలో ని బస్తీ దవాఖానాలో ప్రత్యేకంగా డీ అడిక్షన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. ప్రత్యేకంగా సిబ్బందితో పాటు వైద్యులు, మానసిక నిపుణుడిని నియమించాం. బాధితుడితో పాటు వారి కుటుంబ సభ్యులకు మానసిక నిపుణుడు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. అఖిల్ మహజన్, ఎస్పీ

# విద్యార్థులకు వరం.. ఇంటింటా చదువుల పంట

గోదావరిఖని: విద్యార్థుల్లో నైపుణ్యం పెంచే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. వారిలో ప్రతిభను పెంచడంతో పాటు చదువు పట్ల ఆసక్తి పెంపొందించేందుకు చర్యలు చేపట్టింది. 'ఇంటింటా చదువుల పంట' యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. చరవాణిలో ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని వినియోగించడం ద్వారా విద్యార్థులు అనేక అంశాలపై పట్టు సాధించే అవకాశం ఉంది. పాఠశాలలో బోధించే అంశాలతో పాటు సాంకేతికంగా రూపొందించిన వీడియోలు యాప్‌లో అందుబాటులో ఉంటాయి. బడినుంచి ఇంటికి వచ్చిన తర్వాత యాప్‌ను తెరిచి తమ తరగతి, మాధ్యమాన్ని నమోదు చేసి అంశాన్ని ఎంచుకుంటే అందులో పాఠ్యాంశాల వారిగా ప్రశ్నలు వస్తాయి. కొవిడ్ సమయంలో విద్యార్థులకు ఆన్‌లైన్‌లో బోధించిన సమయంలో ఈ యాప్ వినియోగించారు. ఆ తర్వాత దీనిని పక్కన పెట్టారు. తాజాగా మళ్లీ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి నెల మూడో శనివారం నిర్వహించే పోషకుల సమావేశంలో చరవాణిలో ఇంటింటా చదువుల పంట యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని తల్లిదండ్రులకు వివరిస్తున్నారు.ఉపయోగాలివే...

ప్రతి వారం పాఠశాలలో బోధించిన పాఠ్యాంశాల ప్రశ్నలకు సంబంధించిన లింకు అందుబాటులోకి వస్తుంది. సోమవారం నుంచి శనివారం వరకు బోధించిన పాఠ్యాంశాలు అందుబాటులో ఉంటాయి.

విద్యార్థులు లింకు తెరిచి పాఠశాల పేరు గుర్తించి ప్రవేశ మీట నొక్కాలి. తర్వాత పేరు, తరగతి, సబ్జెక్టు ఎంపిక చేసుకోవాలి. అనంతరం దానికి సంబంధించిన ప్రశ్నలు కనిపిస్తాయి.

యాప్‌లో ఆంగ్ల, తెలుగు మాధ్యమంతో పాటు ఉర్దూ భాషలో సైతం ప్రశ్నలు ఉంటాయి.ప్రతి వారం ప్రధానోపాధ్యాయులు లింకును గ్రూపులోకి పంపిస్తారు. వారం వరకే ఇది అందుబాటులో ఉంటుంది.

పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన తర్వాత విద్యార్థులు తమ అనుమానాలను నివృత్తి చేసుకోవడానికి అవకాశం ఉంటుంది.

ఇందులో పాఠ్యాంశాలతో పాటు పజిల్స్, క్విజ్ తరహా విజ్ఞానాన్ని పెంపొందించే అంశాలుంటాయి.

యాప్ డౌన్‌లోడ్ ఇలా..గూగుల్ ప్లేస్టోర్‌లో ఇంటింటా చదువుల పంట యాప్ అని టైప్ చేయాలి

అందులో మీ ఫోన్ నెంబరు నమోదు చేయగానే ఓటీపీ వస్తుంది.

లింకుపై క్లిక్ చేసి వివరాలను నిక్షిప్తం చేయాలినేర్చుకునే మాధ్యమాన్ని అందులో ఎంచుకోవాలి11 అంకెల యుడైస్ కోడ్ నమోదు చేయాలి. ఆ తర్వాత తరగతి ఉపాధ్యాయుల నుంచి కోడ్ పొందాలిఉమ్మడి జిల్లాలో పాఠశాలలు, విద్యార్థులు విద్యార్థుల్లో మరింత నైపుణ్యం పెంచేందుకుమాధవి, జిల్లా విద్యాధికారిణి, పెద్దపల్లివిద్యార్థుల్లో మరింత నైపుణ్యం పెంచేందుకు ప్రభుత్వం ఇంటింటా చదువుల పంట యాప్‌ను అందుబాటు లోకి తీసుకువచ్చింది. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల తల్లిదండ్రుల చరవాణుల్లో యాప్ డౌన్‌లోడ్ చేయించాలని సూచించాం. ప్రస్తుతం ఆ ప్రక్రియ నడుస్తోంది. యుడైస్ టీచర్లు ఈ ప్రక్రియను చూస్తున్నారు.

# మాట వినకుంటే చర్యలే

హైదరాబాద్ : నిబంధనలు పాటించని పరిశ్రమలపై కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) మొట్టికాయలు వేసింది. మార్గదర్శకాలు పాటించాలని సూచిస్తూనే గడువు విధించింది. ఇంజినీరింగ్, మెటల్ పరిశ్రమలపై ఫిర్యాదుల ఆధారంగా టాస్క్‌ఫోర్స్ తనిఖీలు నిర్వహించింది. ఆ నివేదిక ఆధారంగా మార్గదర్శకాలు జారీ చేసింది. కుత్బుల్లాపూర్ పరిధి దొమ్మర పోచంపల్లిలోని అల్కాలీ మెటల్స్ లిమిటెడ్ ఫైన్ కెమికల్స్‌ను ఉత్పత్తి చేస్తోంది. జులైలో ఈ పరిశ్రమలో కాలుష్య నియంత్రణ చర్యలను పరిశీలించారు. వ్యర్థాల శుద్ధికి ఏర్పాటు చేసిన ఎఫ్లుయెంట్ ట్యాంక్ అవుట్‌లెట్‌కు అమర్చిన 'ఫ్లోమీటర్ పాడైందని గుర్తించారు. వాయు ఉద్గారాల నియంత్రణకు స్క్రబ్బర్ ఏర్పాటు చేయాలని సూచించినా.. నిర్వాహకులు పట్టించుకోలేదు. మేడ్చల్ ప్రాంతీయ అధికారి నోటీసులు జారీ చేశారు. సోడియం అమైడ్స్ తయారీలో హైడ్రోజన్, అమ్మోనియా వాయువును ఉపయోగిస్తున్నారని ఘాటు వాసన వస్తోందని, స్క్రబ్బర్ తప్పనిసరిగా



ఉపయోగించాలని స్పష్టం చేశారు.

**ఇష్టారాజ్యంగా వ్యర్థాల డంపింగ్**

వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వదులుతున్న 'ఏస్ బయోసైన్సెస్'కు పీసీబీ మొట్టికాయలు వేసింది. గాజులరామారంలో ఈ బల్క్‌డ్రగ్ పరిశ్రమ నుంచి వచ్చే ఘాటువాసన, వ్యర్థాలతో ఇబ్బందులు పడుతున్నట్టు స్థానికులు, ఇన్‌కాయిస్ ఇన్‌స్టిట్యూట్ నుంచి పీసీబీకి ఫిర్యాదులందాయి. వ్యర్థాల నిర్వహణ సరిగా లేదని అధికారులు గుర్తించారు. జీడిమెట్లలోని జేఈటీపీలో నమోదైంది. పరిశ్రమలో ఉత్పత్తి అవుతున్న వ్యర్థాల నిర్వహణకు 10కేఎల్ హెచ్‌డీపీఈ సామర్థ్యం ఉన్న ఎఫ్లుయెంట్ కలక్షన్, స్టోరేజ్ ట్యాంక్ ఏర్పాటు చేసుకోవాలి. కానీ 2 కేఎల్ సామర్థ్యమున్న ట్యాంక్‌తోనే నెట్టుకొస్తున్నట్లు ధ్రువీకరించారు. మూసాపేటలోని వాసవి సరోవర్ కన్‌సెంట్ ఫర్ ఎస్టాబ్లిష్‌మెంట్ అనుమతులు తక్షణమే తీసుకోవాలని పీసీబీ ఆదేశించింది.

# ఎన్నికలు లేవు.. విలీనమూ పూర్తికాలేదు



హైదరాబాద్: మహానగరంలో అంతర్భాగంగా ఉన్న కంటోన్మెంట్ పరిధిలో అభివృద్ధిపై నీలినీడలు కమ్ముకున్నాయి. జీహెచ్‌ఎంసీలో కంటోన్మెంట్ బోర్డు విలీన ప్రక్రియ దాదాపు పూర్తయిందనుకుంటుండగా.. ఇప్పటికీ అది పూర్తి కాలేదు. మరోవైపు మూడున్నర ఏళ్లుగా ఎన్నికలు జరగక పోవడంతో ప్రజాప్రతినిధుల ప్రాతినిధ్యం కరవైంది. అప్పటి నుంచి నామినేటెడ్ సభ్యుడు, కంటోన్మెంట్ అధికారులతోనే పాలన సాగుతోంది. సుమారు నాలుగు లక్షల మంది నివసిస్తున్న కంటోన్మెంట్ బోర్డు నిధుల కొరతతో సతమతమవుతోంది. కంటోన్మెంట్ బోర్డుకు పన్నులు, ఇతర ఛార్జీల రూపంలో వసూలయ్యే మొత్తంతో పాటు 15వ ఆర్థిక సంఘం నిధులు, ఎంపీలు ఇచ్చే ఎంపీలాడ్స్ నిధులపైనే పూర్తిగా ఆధారపడి పాలన సాగిస్తోంది. పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలు వంటి వసతుల కల్పన, ఉద్యోగుల జీతభత్యాలకే దాదాపు సమకూరుతున్న నిధులు వ్యయం అవుతుండగా అభివృద్ధి పనులకు నిధులను సమకూర్చుకోవడం తీవ్ర ఇబ్బందికరంగా మారింది.

**ఏడాదిన్నర కిందట ఎన్నికలు వాయిదా**

గత ఏడాది ఏప్రిల్‌లో ఎన్నికలు నిర్వహించేందుకు సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సిద్ధంకాగా ఆఖరి నిమిషంలో వాయిదా వేశారు. జీహెచ్‌ఎంసీలో కంటోన్మెంట్ బోర్డు విలీన ప్రక్రియ నేపథ్యంలోనే వాయిదాపడ్డాయని భావించారు. ఈ నేపథ్యంలోనే బోర్డు విలీన ప్రక్రియ కూడా ముందుకు సాగింది. ఈ ఏడాది జులైలో విలీనానికి మార్గదర్శకాలు కూడా జారీ అయినా విలీన ప్రక్రియ మాత్రం నిలిచిపోయింది. జీహెచ్‌ఎంసీలో కంటోన్మెంట్ ప్రాంతం విలీనమైతే మౌలిక సదుపాయాలు మరింత పెరగడంతో పాటు మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయని స్థానికులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నారు. విలీనం జరగాలని ఆశిస్తూ ఆ దిశగా ప్రక్రియ ముందుకుసాగినా కొలిక్కిరాలేదు. రక్షణ శాఖ ఆధీనంలోని కంటోన్మెంట్ బోర్డులో ఎలాంటి అభివృద్ధి పనులు చేయాలన్నా అనుమతుల ప్రక్రియ కూడా సుదీర్ఘంగా ఉంటుంది. ప్రతిపాదనలను ముందు పుణెకు పంపితే అక్కడ పరిశీలించి దిల్లీకి పంపుతారు. దిల్లీలో అనుమతి మంజూరైతేనే అభివృద్ధి పనులు ముందుకుసాగుతాయి. అనుమతుల ప్రక్రియ సుదీర్ఘంగా ఉంటుండడంతో పనులపై ప్రభావం చూపుతోంది. వసూలు చేయాల్సిన నిధులను వ్యయం చేయాలన్నా కూడా దిల్లీ దాకా వెళ్లాల్సి ఉంటుంది.

ఎన్నికల జరగకపోగా, విలీన ప్రక్రియ కూడా పూర్తికాకపోవడంతో కంటోన్మెంట్ బోర్డు పరిధిలో అసందిగ్ధ పరిస్థితి నెలకొందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు లేకపోవడంతో సమస్యల పరిష్కారం కోసం ప్రధాన కార్యాలయంపైనే ఆధారపడాల్సి వస్తోందని వివరిస్తున్నారు. విలీన ప్రక్రియను సాధ్యమైనంత తర్వగా పూర్తి చేస్తే ఈ ప్రాంతంలో మరింత మెరుగైన మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయని స్థానికులు పేర్కొంటున్నారు.

**రూ.337 కోట్లతో బడ్జెట్**

2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.337 కోట్ల బడ్జెట్‌ను ఆమోదించిన కంటోన్మెంట్ బోర్డు ఈ మొత్తంలో తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణకు రూ.44 కోట్లు, పారిశుద్ధ్యం పరిరక్షణకు అత్యధికంగా రూ.142 కోట్లు, వైద్య,ఆరోగ్య సేవలకు రూ.10 కోట్లు, విద్యకు రూ.35 లక్షలతో పాటు ప్రజాపనులకు రూ.55 కోట్లు ప్రతిపాదించారు. ఇందులో వేతనాలతో పాటు కనీస సౌకర్యాలు, మౌలిక వసతుల కల్పనకే ఎక్కువ మొత్తం వ్యయం చేస్తున్నారు. అభివృద్ధి పనులకు ఒక్కో వార్డులో ఏటా రెండు, మూడు కోట్లు కూడా వ్యయం చేయలేని పరిస్థితి. బడ్జెట్ ప్రతిపాదనలు రూపొందిస్తున్నా నిర్వహణ కార్యక్రమాలకే ఎక్కువ వ్యయం చేస్తుండగా అభివృద్ధి పనులకు నామమాత్రంగానే ఖర్చు చేసేందుకు అవకాశం ఉంటోంది.

# రియాక్టర్‌లో పేలుడు.. కార్మికుడి దుర్మరణం

కుత్బుల్లాపూర్ : ఫార్మా పరిశ్రమ నిర్లక్ష్యం నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. మరో ముగ్గుర్ని చావుబతుకుల మధ్యకు నెట్టింది. అనుభవం లేకపోయినా రియాక్టర్ వద్ద విధుల్లో ఉంచడమే కారణమని బాధితులు, బంధువులు ఆందోళన చేశారు. జీడిమెట్ల పారిశ్రామికవాడ ఫేజ్-4లోని 'అరోర్ ఫార్మాస్యూటికల్స్' పరిశ్రమలో బుధవారం ఉదయం రియాక్టర్ పేలడంతో కార్మికుడు దుర్మరణం చెందాడు. సూరారం పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. ఏపీలోని అనంతపురం జిల్లా గుత్తికి చెందిన అనిల్‌కుమార్ యాదవ్, ప్రకాశం జిల్లా కొత్తపాలెం గ్రామానికి చెందిన గోపిచంద్, అనంతపురం జిల్లాకు చెందిన బలరాం, కరీంనగర్ జిల్లాకు చెందిన శ్రీనివాస్‌రెడ్డిలు సూరారం కాలనీ పరిసర ప్రాంతాల్లో నివాసముంటున్నారు. వారు కొన్ని నెలలుగా అరోర్ పరిశ్రమలో పనిచేస్తున్నారు. రియాక్టర్‌లో ఉత్పత్తుల తయారీ ప్రక్రియ అనంతరం ఉద్యోగులు రియాక్టర్‌ను పూర్తిగా శుభ్రం చేసేందుకు వీరికి అప్పగించారు.

మిథనాల్, నీటితో శుభ్రం చేస్తుండగా ఒక్కసారిగా మంటలు అంటుకొని రియాక్టర్‌లో పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో అనిల్‌కుమార్ యాదవ్(46) మృతి చెందగా.. మిగతా వారికి తీవ్ర గాయాలు




కావడంతో సికింద్రాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆసుపత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటన ఉదయం 9గంటల సమయంలో జరిగితే మధ్యాహ్నం తర్వాతే కుటుంబీకులకు సమాచారం ఇచ్చారని వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతుడి బంధువులు పరిశ్రమ నిర్వహణ అధికారులతో గొడవకు దిగారు. నిర్వహణ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం చోటు చేసుకుందని వారిపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రమాదం జరిగిన సమయంలో మంటల్ని ఆర్పేందుకు అగ్నిమాపక కేంద్రానికి కూడా ఎలాంటి సమాచారం ఇవ్వలేదని.. విషయం తెలుసుకొని సంస్థ వద్దకు వచ్చినా.. ఘటన స్థలానికి వెళ్లనివ్వలేదని అగ్నిమాపక అధికారి శేఖర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందించామని, పరిశ్రమను మూసివేసేలా చర్యలు తీసుకుంటామని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సూరారం ఠాణా ఇన్‌స్పెక్టర్ భరత్‌కుమార్ చెప్పారు.

# బతుకు బండి.. సాగడం కష్టమండి!

ఆదిలాబాద్ : ఆదిలాబాద్‌కు చెందిన విశ్వేశ్వర్ ప్రైవేటు ఉపాధ్యాయుడు. ఆయన నెల జీతం రూ.21 వేలు. గతేడాది వరకు నెలకు ఖర్చులుపోను రూ.2 వేలు చీటి కట్టే ఆయన కుటుంబం ఈ ఏడాది జీతం రూ.వెయ్యి పెరిగినా వచ్చే జీతం మొత్తం ఖర్చులకే సరిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిర్మల్‌కు చెందిన నవీన్ ఆటో డ్రైవర్. నెలకు రూ.15 వేల వరకు సంపాదిస్తారు. గతేడాది వరకు ఆయనకు వచ్చే ఆదాయం అక్కడికక్కడే సరిపోయేది. ప్రస్తుతం పెరిగిన నిత్యావసర సరకుల ధరలతో తన సంపాదన సరిపోయే పరిస్థితి లేక అతడి భార్య ఓ దుస్తుల దుకాణంలో రూ.5 వేలకు పని చేయాల్సి వస్తోంది.

లక్సెట్టిపేట, న్యూస్‌టుడే: ఆకాశాన్నంటుతున్న నిత్యావసర సరకుల ధరలతో సామాన్యుల పరిస్థితి రోజురోజుకూ అగమ్యగోచరంగా మారుతోంది. సగటు మధ్య తరగతి కుటుంబాల ఆదాయం ఏ మాత్రం పెరగకపోగా నిత్యావసర సరకులైన బియ్యం, పప్పు, ఉప్పు, వంటనూనెలు, కూరగాయల ధరలకు రెక్కలు వచ్చి అందకుండా పోతున్నాయి. దీంతో వచ్చే ఆదాయాన్ని సర్దుబాటు చేసుకోలేక పేద, మధ్య తరగతి కుటుంబాలు ఇబ్బందులపాలవుతున్నారు.

**చుక్కలను అంటుతున్న కూరగాయలు**

పెట్రోలు, డీజిల్, కూరగాయల ధరలు సామాన్యుడికి చుక్కలు చూపుతున్నాయి. గత నెలలో టమాటాలు కిలో వందకు, వెల్లుల్లి



రూ. 350కి చేరడం గమనార్హం. టమాట ధరలు కాస్త తగ్గుముఖం పట్టినా వెల్లుల్లి ఘాటు మాత్రం తగ్గకుండా నషాలాన్ని తాకుతోంది. అన్నివర్గాలు విరివిగా ఉపయోగించే ఆలు, ఉల్లి ధరలకు కూడా రెక్కలు వచ్చాయి. **కాగుతున్న నూనెలు**

ఏడాదిగా నిత్యావసర సరకుల ధరలన్నీ పెరిగి ప్రజలపై అదనపు భారం పడుతోంది. వంట నూనె ధరలు గత ఏడాదితో పోలిస్తే 20 నుంచి 30 శాతం మేర పెరిగాయి. పండగలు, ప్రత్యేక సందర్భాల్లో స్థానికంగా వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి నూనెల ధరలు అడ్డగోలుగా పెంచుతున్నారనే ఆరోపణలున్నాయి.

**భార్యాభర్తలు పని చేస్తేనే..**

రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర సరకుల ధరలతో సాధారణ, మధ్య తరగతి కుటుంబాల ఇల్లు గడవడం కష్టంగా మారుతోంది. గతంలో భర్త సంపాదనతో కుటుంబాన్ని నెట్టుకు వచ్చినా.. ప్రస్తుతం భార్యాభర్తలు ఇద్దరూ పని చేయాల్సి వస్తోంది. దిగువ మధ్య తరగతి కుటుంబాల్లో భర్తతోపాటు భార్య కూడా సంపాదన మార్గాలను వెతుక్కోక తప్పడం లేదు.

కొరవడిన పర్యవేక్షణ ఒకే పట్టణంలోని పలు దుకాణాల్లో ఒకే వస్తువు ధరలో రూ.5 నుంచి రూ. 10 వరకు వ్యత్యాసం ఉంటుండటం గమనార్హం. దుకాణాల్లో, రైతు బజార్లలో ధరల పట్టిక నిర్వహించాల్సి ఉన్నా అధికారులు దృష్టిసారించక వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కలెక్టర్ నేతృత్వంలో ధరల నియంత్రణ కమిటీ ప్రతీ మూడు నెలలకు ఒకసారి సమీక్ష సమావేశాలు నిర్వహించాల్సి ఉన్నా ఆ దిశగా అడుగులు పడటం లేదు.

# హైదరాబాద్‌లో అక్రమ నిర్మాణాలు.. అంతస్తుకు రూ.లక్ష నుంచి రూ.5లక్షలు రేటు..




హైదరాబాద్ : గ్రేటర్‌లో జీహెచ్‌ఎంసీ ప్రణాళిక విభాగం, శివారు ప్రాంతాల్లో సంబంధిత పురపాలక సంస్థలు, గ్రామ పంచాయతీల్లోని కొందరు అధికారులు అక్రమ నిర్మాణాలను పరోక్షంగా ప్రోత్సహిస్తున్నారు. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలదీ ప్రధాన పాత్ర. ఈ క్రమంలో కొన్నినిర్మాణాలు కూలుతుండగా, మరికొన్ని నిర్మాణం పూర్తయ్యాక నేలమట్టం అవుతున్నాయి.

**నిబంధనలు పాటించట్లేదు..**

100, 120 గజాల్లోపు స్థలాల్లో నిర్మించే ఇళ్లకు సెట్‌బ్యాక్ నిబంధన ఉండదు. జీ1, జీ2 అంతస్తులకే పరిమితమవ్వాలి. కాని 120గజాల్లోపు ఇళ్లస్థలాల్లో 90శాతం నిబంధనలను ఉల్లంఘించి కట్టినవే కనిపిస్తాయి.

పాతబస్తీ, కోఠి, అబిడ్స్, గోషామహల్, ఫిల్మ్‌నగర్, గచ్చిబౌలి సిద్ధిఖ్‌నగర్, చింతలబస్తీల్లో 40, 50గజాల స్థలాల్లో ఆరు, ఏడు అంతస్తులు నిర్మిస్తున్నారు.

స్థలం విస్తీర్ణం 150 గజాలకు మించితే.. పార్కింగ్ కోసం చుట్టూ ఉండే నిర్మాణాల అంచువరకు జేసీబీతో సెల్లార్లు తవ్వేస్తున్నారు. దాని వల్ల పక్కనున్న భవనాల పునాదులు కదులుతున్నాయి. గచ్చిబౌలి సిద్ధిఖ్‌నగర్‌లో ప్రమాదం ఇలాంటిదే. ప్రమాదానికి గురైన భవనానికేగాక చుట్టూఉన్న 95శాతం నిర్మాణాలకు అనుమతి లేదు.

మాదాపూర్ అయ్యప్ప సొసైటీలో 200గజాల నుంచి వెయ్యి గజాల విస్తీర్ణంలో అపార్ట్‌మెంట్ల నిర్మాణం జరుగుతోంది. ప్రతిదీ ఏడంతస్తులే. కొందరు అవినీతి అధికారులు ఒక్కో అంతస్తుకు రూ.5-10లక్షలు తీసుకుని అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారు.

**తనిఖీలు వసూళ్లకే..**

అక్రమ నిర్మాణాలను అడ్డుకునేందుకు జోనల్ కమిషనర్ల ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ బృందాలు ఉంటాయి. బస్తీలు,కాలనీల్లో పర్యటిస్తూ.. అలాంటి నిర్మాణాలు కనిపిస్తే జోనల్ కమిషనర్‌కు నివేదించాలి. తర్వాత వాటిపై చర్యలు తీసుకోవాలి. కానీ ఈ బృందాల్లోని కొందరు న్యాక్ ఇంజినీర్లు అక్రమ నిర్మాణాలకు నోటీసులిచ్చి, తర్వాత వసూళ్లకు పాల్పడుతున్నారు.

**ఫిర్యాదు చేసేవారి సమాచారం బహిర్గతం** కూకట్‌పల్లి సర్కిల్ మూసాపేట పరిధిలో ఓవ్యక్తి తమ కాలనీలో చేస్తున్న అక్రమ నిర్మాణాల వివరాలను జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయానికి పంపారు. అక్కడి నుంచి కూకట్‌పల్లి అధికారులకు వివరాలు పంపి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వారు ఆయా పనులను నిలిపివే శారు ఒక నెల తర్వాత నిర్మాణ పనులు యథావిధిగా కొనసాగాయి. ఆరాతీస్తే.. కొందరు అధికారులు నిర్మాణదారుల నుంచి ముడుపులు తీసుకున్నట్లు ఆరోపణలొచ్చాయి. ఫిర్యాదు చేసిన వ్యక్తి వివరాలను బిల్డర్లకు ఇచ్చారు. వారంతా ఫిర్యాదు చేసిన వ్యక్తి ఇంటికి వెళ్లి బెదిరించారు.

# పర్యవేక్షణతోనే ఆర్థికాభివృద్ధి

మెట్‌పల్లి: అతివలు ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు అందిస్తూ బాసటగా నిలుస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం పొదుపు సంఘాల మహిళలను మరింత స్వయం సమృద్ధి దిశగా నడిపేందుకు మహిళా శక్తి పేరుతో వివిధ రంగాల్లో రాణించేలా కార్యాచరణ సిద్ధం చేసింది. జిల్లాలో లక్ష్యం నిర్దేశించగా ఇప్పటికే కొన్ని యూనిట్లు ప్రారంభమయ్యాయి. మరికొన్ని ఇంకా గ్రౌండింగ్ చేయాల్సి ఉంది. ప్రారంభించిన యూనిట్లతో మహిళలు ఉపాధి పొంది ఆర్థికాభివృద్ధి సాధించేలా సంబంధిత అధికారులు పర్యవేక్షిస్తేనే అనుకున్న లక్ష్యం నెరవేరుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పథకం కింద నాటుకోళ్ల పెంపకం, పాడి గేదెలు, పాల ఉత్పత్తులు, మీసేవా కేంద్రాలు, క్యాంటీన్లు, ఈవెంట్ మేనేజ్‌మెంట్, మొబైల్ ఫిష్ రిటైల్ ఔట్‌లెట్ తదితర యూనిట్ల ఏర్పాటుకు నిర్ణయించారు. మండలాల వారీగా గ్రామైక్య సంఘాల్లోని మహిళలను గుర్తించి వారికి ఆయా రంగాల్లో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. యూనిట్ల లక్ష్యం నిర్దేశించి బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా అవసరమైన రుణాలు మంజూరు చేస్తున్నారు. వీటి ద్వారా అతివలు ఉపాధి పొంది ఆర్థిక స్వావలంబన సాధించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటికే ఆసక్తి చూపిన మహిళలు రుణాలు పొంది యూనిట్లను ప్రారంభించారు.

పొదుపు సంఘాల మహిళలు ఆర్థికంగా బలోపేతమైతేనే వారి కుటుంబాలు అభివృద్ధి సాధిస్తాయని ప్రభుత్వాలు భావిస్తున్నాయి. కోడిమాంసం, గుడ్లకు డిమాండ్ ఉన్నందున మహిళా శక్తి కింద నాటుకోళ్ల పెంపకం వైపు మహిళలను మళ్లించాలని యోచించారు. సంఘాల వారీగా మదర్, వ్యక్తిగత యూనిట్ల ఏర్పాటుకు లబ్ధిదారులను ఎంపిక చేశారు. జిల్లాలో 18 మదర్ యూనిట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించి ప్రారంభించారు. వీటి ద్వారా లబ్ధిదారులకు నాటుకోళ్లను సరఫరా చేసి పెంపకం ద్వారా ఆదాయం ఆర్జించాలన్నది లక్ష్యం. 1800 యూనిట్ల లక్ష్యం పెట్టుకోగా ఇప్పటికే నాటుకోళ్ల పెంపకం ప్రారంభించారు. బస్టాండ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు వంటి రద్దీప్రాంతాల్లో మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటులో భాగంగా జిల్లాలో జగిత్యాల, మల్లాపూర్, కోరుట్ల మండలాల్లో ఒకటి, మల్యాల మండలంలో రెండు క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. అయిదింటికి అయిదు ఏర్పాటు చేసి లక్ష్యం పూర్తి చేసినా జిల్లా అధికారులు మండలానికి ఒకటి ఏర్పాటుకు ముందుకొచ్చేలా చూడాలని ఆదేశించారు. ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఏర్పాటైన యూనిట్లను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి సలహాలు, సూచనలిస్తేనే మహిళల ఆర్థికాభివృద్ధి సాధ్యమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**ఇవి కూడా ప్రారంభిస్తేనే..**విద్యావంతులైన మహిళలు స్వయం ఉపాధి పొందేలా వారితో మీసేవా కేంద్రాలను ప్రారంభించాలని నిర్ణయించారు. గ్రామాల్లో కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ సేవలను దగ్గర చేయడంతో పాటు సాధారణ కేంద్రాల వలే అన్ని పనులు నిర్వర్తించేలా యోచించారు. జిల్లాలో 17 మండలాల్లో మీసేవా కేంద్రాల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించినా ఇంకా ప్రారంభించలేదు. అలాగే పాడి గేదెల యూనిట్లకు 787 మంది లబ్ధిదారులను గుర్తించినా 30 మందికే యూనిట్లను గ్రౌండింగ్ చేశారు. ఇటీవల గేదెలకు వచ్చిన ఓ వ్యాధి మూలంగా యూనిట్ల గ్రౌండింగ్ నిలిపివేసినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. అలాగే మొబైల్ ఫిష్ రిటైల్ ఔట్‌లెట్, ఈవెంట్ మేనేజ్‌మెంట్ యూనిట్లను గ్రౌడింగ్ చేయాల్సి ఉంది.

లక్ష్యం పూర్తికి చర్యలుచరణ్‌దాస్, అదనపు పీడీ

జిల్లాలో మహిళా శక్తి క్యాంటీన్లు, నాటుకోళ్లు, వ్యక్తిగత యూనిట్లు లక్ష్యం మేర పూర్తి చేశాము. మీసేవా కేంద్రాల ఏర్పాటుకు ఉన్నతాధికారుల నుంచి అనుమతి రావాల్సి ఉంది. ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లో ఒకరికి శిక్షణ ఇప్పించాము. మొబైల్ ఫిష్ రిటైల్ ఔట్‌లెట్ ఏర్పాటుకు ఒకరిని గుర్తించాము. ఇటీవల గేదెలకు వచ్చిన వ్యాధి మూలంగా సంబంధిత యూనిట్ల గ్రౌండింగ్ నిలిపివేశాము. త్వరలోనే గ్రౌండింగ్ పూర్తవుతుంది.

# ధర తక్కువని ఆశపడితే.. ఆరోగ్యం గల్లంతే



హైదరాబాద్: తక్కువ ధరకు వస్తోందని అల్లం పేస్ట్ కొంటున్నారా! టీ చుక్క రుచిగా ఉందని ఆస్వాదిస్తున్నారా! అయితే మీరు ఓ సారి ఆలోచించాల్సిందే. నగరంలో కల్తీ పదార్థాలు తయారు చేస్తున్న ముఠాల వ్యాపారాలు వీధివీధినా విస్తరించాయి. ఏళ్ల తరబడి నివాసాల మధ్య కుటీర పరిశ్రమల ముసుగులో కల్తీ దందా కొనసాగిస్తున్నారు. మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు, మేనేజర్లను నియమించుకొని ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. ఇటీవల టాస్క్‌ఫోర్స్ పోలీసులు వరుస తనిఖీల్లో భారీ ఎత్తున కల్తీ అల్లం పేస్ట్, టీ పొడి, మిరపకారం, పాల పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు.

ప్రముఖ బ్రాండ్ల పేరుతో.. ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్న కల్తీ రాయుళ్లపై చేపట్టిన దర్యాప్తులో విస్మయం గొలిపే విషయాలు వెలుగు చూస్తున్నాయి. ప్రముఖ బ్రాండ్ల పేరుతో ప్రజలకు నిత్యం అవసరమయ్యే ఆహార పదార్థాలను భారీ ఎత్తున సరఫరా చేస్తున్నట్టు అధికారులు నిర్ధారించారు. తోపుడు బండ్ల నుంచి ప్రముఖ హోటళ్ల వరకూ మాంసాహార వంటకాలదే హవా. హైదరాబాద్ అంటే బిర్యానీ. వారాంతం కుటుంబసమేతంగా బయటకెళ్లి బిర్యానీ రుచి చూడటం సాధారణం. తాజాగా సికింద్రాబాద్ ఓల్డ్ బోయిన్‌పల్లిలో యాసిడ్ ఉపయోగించి కల్తీ అల్లం పేస్ట్ తయారీ కేంద్రంపై దాడులు నిర్వహించి 8 మందిని అరెస్ట్ చేశారు. ఆరోగ్యానికి హానికలిగించే రసాయనాలతో దీన్ని తయారు చేస్తున్నట్టు నిర్ధారించారు. ప్రతిరోజూ అక్కడ 1500 కిలోల కల్తీ అల్లం పేస్ట్ తయారు చేసి సుమారు 100 హోటళ్లకు, పలు దుకాణాలకు తక్కువ ధరకు సరఫరా చేస్తున్నట్టు గుర్తించారు. వీటిలో కొన్ని సూపర్‌మార్కెట్లు, 20కు పైగా ప్రముఖ హోటళ్లు ఉండడం ఆందోళన కలిగిస్తోంది. పాతబస్తీ, పహాడీషరీఫ్, కాటేదాన్, మైలార్‌దేవ్‌పల్లి, సికింద్రాబాద్, అత్తాపూర్, ఆసిఫ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో 60కు పైగా కల్తీ పదార్థాల తయారీ స్థావరాలున్నట్టు పోలీసులు గుర్తించినట్టు సమాచారం. అక్కడ తయారవుతున్న చిరుతిళ్లు, నూనెలు, టీపొడి, అల్లం పేస్ట్‌లకు ప్రముఖ బ్రాండ్ల స్టిక్కర్లు అంటించి ప్యాకింగ్ చేసి మార్కెట్‌లోకి వదులుతున్నారు. ఇటీవల టాస్క్‌ఫోర్స్ పోలీసులు 500 కిలోల కల్తీ టీపొడి స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా ప్రతిరోజూ నగరంలో 30కు పైగా ఛాయ్ బండ్లకు కల్తీ సరకు సరఫరా చేస్తున్నట్టు నిర్ధారించారు. ఆయా హోటళ్ల వివరాలను జీహెచ్‌ఎంసీ అధికారులకు అందజేసినట్టు సమాచారం.

# నూలు.. నేతన్నకు మేలు

సిరిసిల్ల : జిల్లాలో ఏడు దశాబ్దాల క్రితమే చేనేత నుంచి క్రమంగా మరమగ్గాలు విస్తరిస్తూ వచ్చాయి. నాటి నుంచి వస్త్ర పరిశ్రమ అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటూనే వేలాది మంది నేతన్నలకు ఉపాధినిస్తోంది. ఇటీవల ప్రభుత్వం వేములవాడలో రూ.50 కోట్ల కార్పస్ ఫండ్‌తో నూలు బ్యాంకు ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేసింది. వేములవాడ మార్కెట్ యార్డులో దీనిని ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇది అందుబాటులోకి వచ్చాక జిల్లా వస్త్ర పరిశ్రమకు నూతన జవసత్వాలు వస్తాయి.

పొరుగు రాష్ట్రాల్లో...

తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రలలో మరమగ్గాల వస్త్రోత్పత్తి సమూహాలున్న చోట నూలు ఉత్పత్తి కంపెనీలే నేరుగా విక్రయశాలలు ఏర్పాటు చేస్తాయి. అక్కడ నూలు విక్రయాల్లో మధ్య దళారీ వ్యవస్థ కనిపించదు. చిన్న, మధ్య తరగతి వస్త్రోత్పత్తిదారులు తమకు వచ్చే ఆర్డర్లకు అనుగుణంగా నూలు కొనుగోలు చేస్తారు. వాటితో నేసిన వాటిని స్వయంగా విక్రయించవచ్చు. ఇలా చేయడం వల్ల తమ నైపుణ్యంతో కళాత్మకమైన ఉత్పత్తులు వెలువడతాయి. వీటిని బహిరంగ మార్కెట్‌లో విక్రయించడం ద్వారా తమ ప్రతిభకు గుర్తింపు లభించే అవకాశం ఉంటుంది.

జిల్లాలో 30,352 మరమగ్గాలపై రోజుకు సగటున మూడు లక్షల మీటర్ల పాలిస్టర్ వస్త్రోత్పత్తి జరుగుతోంది. ఇది దక్షిణ భారతదేశంలోనే అత్యధికం. ఇక కాటన్ ఉత్పత్తులు లక్ష మీటర్లలోపే ఉంటుంది. ప్రభుత్వ, ప్రైవేటు ఆర్డర్లన్నీ కలిపి ఏటా సుమారు 20 వేల టన్నుల పాలిస్టర్, ఐదు టన్నులపైగా కాటన్ నూలు వాడుతారు. ఇంత వినియోగం ఉన్నా దశాబ్దాలుగా ఇక్కడ నూలు బ్యాంకులు, ప్రైవేటు నూలు విక్రయశాలలు లేకపోవడం గమనార్హం. జిల్లాలో వివిధ



కంపెనీల నూలు విక్రయ ఏజెంట్లు, మధ్యదళారులు మాత్రమే అమ్ముతున్నారు. ప్రైవేటు నూలు కంపెనీలు నేరుగా నూలు విక్రయశాలలు ఏర్పాటు చేస్తే జిల్లా వస్త్ర పరిశ్రమలో ఉపాధితోపాటు విస్తరణకు అవకాశాలున్నాయి.

ఘనమైన చరిత్ర

జిల్లాలో సొంత ఉత్పత్తులు తక్కువ. అందుకే అయిదు దశాబ్దాలుగా మరమగ్గాల వస్త్రోత్పత్తులు జరుగుతున్నా జిల్లాకు ప్రత్యేకంగా గుర్తింపు అంటూ లేకుండా పోయింది.

ప్రభుత్వం ఆర్డర్లు వచ్చినపుడు ముడి సరకు కొనుగోలుకు ఆర్థిక ఇబ్బందుల నుంచి ఉపశమనం లభిస్తుంది. సంఘాల వారీగా వచ్చిన ఆర్డర్లకు నూలు డిపో నుంచి ముడి సరకును తీసుకుని ఉత్పత్తి చేసిన వస్త్రాన్ని అప్పగించాలి. దీనిలో నూలు ఖర్చును మినహాయించుకుని మిగతా డబ్బులు చెల్లింపులు జరుగుతాయి. దీంతో చిన్న, మధ్య తరగతి ఆసాములు ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం ఉంది.

వస్త్రాల సేకరణకు జిల్లాలో టెస్కో ఆర్‌డీడీ (రీజినల్ డిప్యూటీ డైరెక్టర్) స్థాయి ఉద్యోగిని నియమించాలి. ప్రస్తుతం ఈ విభాగంలో తాత్కాలిక ఉద్యోగులే చూస్తున్నారు. ప్రభుత్వ ఆర్డర్లపై జిల్లాలో పర్యవేక్షణ పెంచాలి. మనుగడ కోల్పోతున్న కాటన్ ఉత్పత్తులతోపాటు దాని అనుబంధ రంగాలైన సైజింగ్, అద్దకం పరిశ్రమలకు పూర్వవైభవం వచ్చే అవకాశాలున్నాయి.

ప్రణాళికతో ముందుకెళ్తున్నాం

– ఆది శ్రీనివాస్, ప్రభుత్వ విప్

కార్మిక, ధార్మిక క్షేత్రమైన జిల్లాలో రాజన్న ఆలయ అభివృద్ధితోపాటు నేతన్నల సంక్షేమానికి ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. వేములవాడ చేనేత క్లస్టర్‌కు నూలు డిపో మంజూరైంది. దీంతో సిరిసిల్లతోపాటు గర్షకుర్తి, కొత్తపల్లి వరకు నేతన్నలకు ఎవరికి అవసరమున్నా తీసుకెళ్లవచ్చు. ప్రభుత్వ, ప్రైవేటు ఆర్డర్లకు అవసరమైన నూలు ఇక్కడ అందుబాటులో ఉంటుంది. అంచెలంచెలుగా దీని సామర్థ్యం రూ.100 కోట్లకు పెంచుతాం. త్వరలోనే ప్రారంభానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

# నిర్వహణ లేమి.. అనారోగ్యమే మరి

కోదాడ : ఈ చిత్రంలో వేలాడదీసిన మాంసాన్ని తింటున్న ప్రాంతం కోదాడ పట్టణంలోనిది. దుకాణదారుడు బయటకు వెళ్లడంతో ఆరుబయట వేలాడదీసిన మాంసంను కుక్క తింటుండగా స్థానికులు వీడియో తీయడంతో స్థానికంగా అది వైరల్ అయింది. ఎవరూ చూడకపోతే అదే మాంసం విక్రయిస్తే ప్రాణాలకే ప్రమాదకరం. వచ్చిందంటే చాలు ప్రతి ఇంట్లో మాంసం వంటకాలతో వంట గది ఘుమఘుమలాడాల్సిందే. మాంసం ధరలు రోజురోజుకు పెరుగుతున్నా విక్రయాల్లో మాత్రం తేడాలుండట్లేదు. కానీ విక్రయించే చోట శుభ్రత ఉండటం లేదు. విక్రయదారులకు స్థలం లేకపోవడంతో తోపుడు బండ్ల మీదే విక్రయిస్తున్నారు. ఒక్క కోదాడ పట్టణంలోనే ఆదివారం పదుల సంఖ్యలో బండ్ల మీద విక్రయిస్తున్నారు. రహదారి మీద వచ్చిపోయే వాహనాలకు దుమ్ము, ధూళి మాంసంపై పడుతున్నా, ఈగలు వాలుతున్నా పట్టించుకోవడం లేదు.

ప్రత్యేక షెలరు లేక..



మాంసం విక్రయించేందుకు ప్రత్యేక మార్కెట్ ఏర్పాటు చేయాలని దుకాణాదారులు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. ప్రత్యేకంగా మార్కెట్ ఉంటే శుభ్రత పాటించవచ్చని, రహదారి మీద ఇబ్బందిగా ఉంటుందని వారు వాపోతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న పురపాలికల్లో మాంసం విక్రయాల కోసం ప్రత్యేక మార్కెట్లు లేక అంతటా ఇదే తరహా విక్రయాలు కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

శుభ్రత పాటించకుంటే జరిమానాలు

–యాదగిరి, శానిటరీ ఇన్‌స్పెక్టర్, కోదాడ

మాంసం విక్రయదారులు ఆరుబయట విక్రయించేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. దుమ్ము, ధూళి పడకుండా కవర్లు ఏర్పాటు చేయాలి. శుభ్రత పాటించకుండా విక్రయిస్తే జరిమానాలు విధిస్తాం. పురపాలిక తరఫున విక్రయదారులకు దుకాణాలు ఏర్పాటు చేస్తాం.

# పల్లెకు మార్గం.. సుగమం



తాండూరు : గ్రామీణ ప్రజల ప్రయాణానికి మార్గం సుగమం కానుంది. అనుబంధ రహదారుల నిర్మాణ కల సాకారం కానుంది. వెరసి తక్కువ దూరం ప్రయాణించి పల్లెలకు చేరుకునే వెసులుబాటు లభించనుంది. సమయం ఆదా కానుంది. రహదారుల మంజూరు నేపథ్యంలో కథనం. ఇతర గ్రామాల మీదుగా రావాల్సిన పరిస్థితి: జిల్లాలో వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాలు, 4 మున్సిపాలిటీలు ఉండగా, 20 మండలాలు, 566 గ్రామ పంచాయతీలున్నాయి. దాదాపుగా అన్ని గ్రామాలకు అనుబంధ దారులు అధ్వానంగా ఉన్నాయి. ఉదాహరణకు.. కొడంగల్, బషీరాబాద్, పెద్దేముల్, వికారాబాద్ మండలాల్లో మారుమూల తండాలు ఎక్కువగా ఉన్నప్పటికీ మట్టిదారులే దిక్కు. వర్షాకాలం వచ్చిందంటే వీటిలో ప్రయాణం నరకప్రాయంగా మారింది.

మోమిన్‌పేట మండల పరిధిలో అనుబంధ తండాలకు మట్టిదారుల్లో వెళ్లలేక ప్రజలు, రైతులు నానా అవస్థలు పడుతున్నారు.

తాండూరు మండలంలో 33 గ్రామ పంచాయతీలు ఉండగా వీటికి అనుబంధంగా మరో 13 గ్రామాలు కొనసాగుతున్నాయి. ఇవి ఒకదానికికొకటి పక్కపక్కనే ఉన్నప్పటికి రహదారి సదుపాయంలేక ఇతర గ్రామాల మీదుగా రాకపోకలు సాగించాల్సిన దుస్థితి. దీంతో వాహనదారులపై రవాణా భారం పడుతుండగా సమయం వృథా అవుతోంది. మండలంలోని నారాయణ్‌పూర్–పాతతాండూరు దూరం 5.10కి.మీ. ఉండగా రహదారి నిర్మించని కారణంగా యాలాల మండలం మీదుగా 16 కి.మీ. ప్రయాణించి గ్రామానికి చేరుకుంటున్నారు. తాజాగా ఆయా రహదారుల్లో పంచాయతీరాజ్ శాఖ అధికారులు రూ.16.30కోట్లు నిధులతో 22.15కి.మీ మేర తారు రహదారులు నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

టెండరు ప్రక్రియ నిర్వహిస్తున్నాం: గ్రామాలకు కొత్తగా అనుబంధ రహదారులు నిర్మించేందుకు టెండర్లు పిలిచాం. మట్టిదారులు, పొనాది మార్గాల్లో తొలిసారిగా తారు రహదారులు నిర్మింపజేస్తాం. త్వరలోనే పల్లెలకు కొత్త తారు రహదారులు అందుబాట్లోకి వస్తాయి.

నాగభూషణం, డీఈ, పంచాయతీరాజ్ శాఖ, తాండూరు.

# ఎక్కడి దస్త్రం అక్కడే



కరీంనగర్ : నగరపాలక సంస్థ కార్యాలయంలోని రెవెన్యూ విభాగం గాడీ తప్పింది. పన్నుల వసూలు, కొత్త ఇంటి నంబర్ల కేటాయింపు, వాణిజ్య భవనాల రీఅసెస్‌మెంట్ పనులు మినహాయిస్తే మిగతా దస్త్రాలన్నీ పెండింగ్‌లో ఉంటున్నట్లుగా ఫిర్యాదులు వస్తున్నాయి. క్షేత్రస్థాయి నుంచి విభాగం అధికారి వరకు దస్త్రం పెండింగ్‌లోనే లేదని దాటేస్తుండగా దరఖాస్తుదారులు మాత్రం పనులు చేయాలని కార్పొరేటర్ల చుట్టూ తిరుగుతున్నారు.

నెలల తరబడి పెండింగ్

రెవెన్యూ విభాగంలో బిల్ కలెక్టర్లతోపాటు నలుగురు రెవెన్యూ అధికారులు(ఆర్.ఐ), ఒక ఆర్వో ఉన్నారు. పేరుమార్పిడి, పన్ను మదింపు వంటి అర్జీలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాల్సి ఉండగా ఇటీవల నెలల తరబడి పెండింగ్‌లో ఉంచుతున్నట్లు తెలుస్తోంది. కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అన్నింటికీ కొర్రీలే

పేరుమార్పిడి, ఇతరత్రా పనుల కోసం రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లతోపాటు అవసరమైన కాగితాలతో దరఖాస్తు చేసుకుంటున్నారు. ఎక్కడ లేని నిబంధనలు జత చేసి, లేని కాగితాలు తీసుకు రావాలని ఆదేశిస్తుండటం, కొర్రీలతో అర్జీదారులు నానావస్థలు పడుతున్నారు. గత్యంతరం లేక కొందరు అడ్డదారుల్లో వచ్చి ఎంతో కొంత ముట్టజెప్పి పనులు చేసుకుంటున్నారు. పైసలు ఇవ్వనిదే దస్త్రాలు కదలడం లేదని పలువురు పాలకవర్గ సభ్యులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

కొన్ని దృష్టాంతాలు ఇలా..

తీగలగుట్టపల్లి ప్రాంతవాసి ఇంటినంబర్ కోసం దరఖాస్తు చేశారు. దీనికి కావాల్సిన దరఖాస్తుతోపాటు రిజిస్ట్రేషన్ దస్తావేజులు జత చేశారు. నిబంధనల ప్రకారం అంటూ ఆ దస్త్రాన్ని న్యాయ సలహా కోసం పంపించారు. దీనికి స్టాంపు డ్యూటీ రూ.40 వేలు చెల్లించాల్సి ఉంటుందని న్యాయ సలహాదారు చెప్పడంతో దరఖాస్తుదారు వెనక్కి తగ్గారు. లింకు కాగితాలు, రిజిస్ట్రేషన్ పక్కాగా ఉండగా కొర్రీ పెట్టడంలో మతలబు ఏమిటో తెలియక ఆ దస్త్రాన్ని అలాగే రెవెన్యూ విభాగంలో ఉంచారు.

కమాన్ రోడ్డులో పేరు మార్పిడి చేసుకోగా బైఫరికేషన్ నంబర్ కోసం ఒకరు దరఖాస్తు చేశారు. ఒకరిపైనే పన్ను భారం పడుతుండగా కొనుగోలుదారుకు నంబర్ ఇవ్వాల్సి ఉండగా 9 నెలలుగా తిప్పుతున్నారు. దేనికోసం ఇబ్బందులు పెడుతున్నారని నిలదీసినా అధికారుల దగ్గరి నుంచి సమాధానంలేదని దరఖాస్తుదారు అంటున్నారు.

బుట్టిరాజరాంకాలనీకి చెందిన ఒకరు రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత పేరు మార్పిడికి 3 నెలల కిందట దరఖాస్తు చేశారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారి పరిశీలించాల్సి ఉండగా.. వెళ్లడంలేదు.

ఉస్మాన్‌పురకు చెందిన ఒక ఇంటి యజమాని పేరు మార్పిడి చేసుకున్నారు. బై ఇంటి నంబర్ ఇచ్చేందుకు ఆర్ఐ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మూడు నెలలుగా ఇంటి నంబర్ మాత్రం రావడంలేదు. ఎందుకు జాప్యం అవుతుందని పేర్కొన్నా సమాధానం దాటేస్తున్నారని బాధితులు చెబుతున్నారు.

విద్యానగర్‌కు చెందిన ఒకరు ఆస్తిని గిఫ్ట్ చేస్తూ రిజిస్ట్రేషన్ చేశారు. అక్కడే ఆన్‌లైన్‌లో పేరుమార్పిడి జరిగిపోగా.. నగరపాలికలో తిరస్కరించారు. అన్ని ఆధారాలతో రిజిస్ట్రేషన్ జరిగిపోగా.. దేనికోసం ఆరా తీస్తే కుటుంబ సభ్యుల సర్టిఫికెట్ తప్పనిసరి అని మెలిక పెట్టారు. రెవెన్యూ శాఖలో మాత్రం సాధారణ ప్రజలకు ఈ సర్టిఫికెట్ జారీ చేయడం లేదు. ఇలా 20 దరఖాస్తులను రిజెక్ట్ చేయడంతో ఆ సర్టిఫికెట్‌ను నగరపాలక అధికారులే ఇప్పించాలని డిమాండ్ చేస్తున్నారు. నోటీసులు ఇస్తున్నారు

–స్వరూపరాణి, డిప్యూటీ కమిషనర్, నగరపాలిక

ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దస్త్రాలు పెండింగ్‌లో లేవు. మిగతా వాటికి దస్త్రాలు సరైన విధంగా లేకపోతే వాటికి నోటీసులు ఇస్తున్నారు. కొన్ని మ్యుటేషన్ ఫీజులు చెల్లించకపోవడంతో పెండింగ్‌లో ఉంటున్నాయి.

# సీఐ.. ఇక ఠాణా బాస్

భువనగిరి : ఎస్సైలు.. స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌వో)లుగా ఉన్న పోలీస్ స్టేషన్ల స్థాయి పెంచుతున్నారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను ఎస్‌హెచ్‌వోలుగా నియమిస్తూ బలోపేతం చేస్తున్నారు. జిల్లాలో బీబీనగర్, ఆత్మకూరు(ఎం) రెండు పోలీస్ స్టేషన్లకు ఇప్పటికే సీఐలను నియమించారు. ఇటీవల వారు బాధ్యతలు చేపట్టారు. త్వరలో మరిన్ని పోలీస్ స్టేషన్ల స్థాయి పెంచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇదే క్రమంలో రాచకొండ కమిషనర్ కార్యాలయంలో బదిలీల ప్రక్రియ నడుస్తోంది.

రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఉన్న యాదాద్రి భువనగిరి జిల్లా జోన్‌లో ప్రస్తుతం మూడు డివిజన్లు, నాలుగు సర్కిళ్లు, 18 పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. స్టేషన్ల సీఐలను ఎస్‌హెచ్‌వోలుగా నియమించాలని గతంలోనే నిర్ణయం తీసుకున్నారు. ఆ ప్రతిపాదనలో భాగంగా మొదటగా రెండు స్టేషన్లను ఎస్‌హెచ్‌వోలును నియమించారు. భువనగిరి, చౌటుప్పల్, యాదగిరిగుట్ట పట్టణ పోలీస్ స్టేషన్లకు మాత్రమే ఇన్‌స్పెక్టర్లు ఎస్‌హెచ్‌వోలుగా ఉన్నారు. మిగతా పోలీసు స్టేషన్లు నాలుగు సర్కిళ్లలో పరిధిలో విస్తరించి ఉన్నాయి. ఆయా స్టేషన్లకు ఎస్సైలు ఎస్‌హెచ్‌వోలుగా వ్యవహరిస్తున్నారు. ఒక్కో సర్కిల్ పరిధిలో మూడు నుంచి ఐదు పోలీస్ స్టేషన్ల వరకు ఉన్నాయి.

భువనగిరి సర్కిల్ పరిధిలో భువనగిరి గ్రామీణం, బీబీనగర్, బొమ్మలరామారం మూడు స్టేషన్లు ఉండేవి. ప్రస్తుతం భువనగిరి గ్రామీణ, బొమ్మలరామారం స్టేషన్లు మాత్రమే భువనగిరి రూరల్ సీఐ పరిధిలోకి తీసుకొచ్చి రెండు ఠాణాలకు కలిపి సీఐని నియమించారు. రామన్నపేట సర్కిల్ పరిధిలో ఆత్మకూరు(ఎం) ఉంది. బీబీనగర్, ఆత్మకూరు(ఎం) రెండు స్టేషన్లలో ఇప్పటి వరకు ఎస్సైలు మాత్రమే స్టేషన్ బాస్‌గా ఉన్నారు. రెండు స్టేషన్లకు సీఐ స్థాయికి పెంచి అధికారులను నియమించారు.

కేసుల నమోదు ఎక్కువే

యాదాద్రి భువనగిరి జిల్లా హైదరాబాద్ సరిహద్దు కావడంతో భూ సంబంధిత కేసులు, సొత్తు దొంగతనం, ఇతర నేరాలు ఎక్కువగానే నమోదవుతుంటాయి. భూములు సరిహద్దు గొడవలు, లావాదేవీలలో తలెత్తే సమస్యలతో నిత్యం పదుల సంఖ్యల పోలీసేస్టేషన్లకు బాధితులు వస్తుంటారు. వీటితో పాటు చోరీలు, మిస్సింగ్‌లు ఎక్కువగా నమోదువుతుంటంతో కొన్ని స్టేషన్ల ఎస్సైలకు పనిభారం ఉండటం, నిర్లక్ష్యంగా వ్యవహరించడం చోటుచేసుకుంటున్నాయి.




ప్రస్తుతం వలిగొండ, ఆలేరు, మోత్కూరు, బొమ్మలరామరాం, రామన్నపేట వంటి స్టేషన్ల కింద మండల కేంద్రంతో పాటు 35 పైగా గ్రామాలు ఉన్నాయి. ఆయా స్టేషన్ల వివిధ ఫిర్యాదులు, గొడవలు, ఇతర సమస్యలతో పోలీసు స్టేషన్లకు వచ్చే బాధితులు ఎక్కువగానే ఉంటారు.

జిల్లాలో పోలీస్ శాఖ స్వరూపం ఇది..

జోన్: యాదాద్రి

డివిజన్లు : భువనగిరి, చౌటుప్పల్, యాదగిరిగుట్ట

సర్కిళ్లు: భువనగిరి గ్రామీణం, యాదగిరిగుట్ట, చౌటుప్పల్, రామన్నపేట

భువనగిరి గ్రామీణం: భువనగిరి గ్రామీణం, బొమ్మలరామారం

యాదగిరిగుట్ట రూరల్ : రాజపేట, ఆలేరు, తుర్కపల్లి, మోటకొండూరు, గుండాల

రామన్నపేట: రామన్నపేట, ఆడ్డగూడూరు, మోత్కూరు, ఆత్మకూరు, వలిగొండ

చౌటుప్పల్: చౌటుప్పల్, పోచంపల్లి, నారాయణపురం

# కాజ్‌వేలు ధ్వంసం.. మరమ్మతులు పూజ్యం

ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ పరిధిలోని బాకురుపల్లి, బాకురుపల్లితండా గ్రామాల నడుమ రోడ్డు, కల్వర్టు ధ్వంసమై మూడేళ్లు అవుతుంది. ప్రస్తుతం కాజ్‌వే కూలిపోయే దశకు చేరుకుంది. కింది భాగంలోని మట్టి, కంకర కొట్టుకుపోవడంతో సీసీ గాలిలో వేలాడుతూ ప్రమాదభరితంగా మారింది. భారీ వాహనాలు వెళితే పూర్తిగా నేలమట్టమయ్యే దుస్థితి నెలకొంది. అయినా కాజ్‌వేను ఇప్పటి వరకు మరమ్మతు చేయలేదు.మండల కేంద్రం నుంచి సత్సంగ సదనం మీదుగా కోరుట్లపేటకు వెళ్లే రోడ్డులో ఓ కల్వర్టు కిందిభాగం కొట్టుకుపోగా సీసీ వేలాడుతోంది. దీనిపై భారీ వాహనాలు వెళితే కూలిపోయే ప్రమాదం నెలకొంది. గతంలో ఓ ట్రాక్టర్ కల్వర్టుపై నుంచి నీటిలో పడిపోగా త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. నాయకులు,



అధికారులు కల్వర్టును పరిశీలించడమే తప్ప నిధుల మంజూరుకు ఎలాంటి కృషి చేయలేదు. గత మూడు నాలుగేళ్లుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎల్లారెడ్డిపేట మండలంలోని వివిధ ప్రాంతాల్లో రహదారులతోపాటు కాజ్‌వేలు ధ్వంసమయ్యాయి. పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని కూలిపోయే దశకు చేరుకున్నా పట్టించుకున్న నాథుడు లేడు. ఏమాత్రం ఏమరుపాటుగా వెళ్లినా ప్రాణాలు గాల్లో కలిసిపోయే ప్రమాదం ఉంది.అల్మాస్‌పూర్ నుంచి బుగ్గరాజేశ్వరతండాకు వెళ్లే రహదారిలో వంతెన ఓవైపు పూర్తిగా ధ్వంసమైంది. కల్వర్టుల వద్ద మట్టి కోతకు గురైంది. కనీసం మట్టి పోసి, తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి నుంచి కోరుట్లపేటకు వెళ్లే రెండు వరుసల రహదారిలో కోరుట్లపేట వద్ద కాజ్‌వే, అలాగే మండల కేంద్రం నుంచి బండలింగంపల్లికి వెళ్లే రోడ్డులో రెండు కాజ్‌వేలు, అక్కపల్లి వద్ద కాజ్‌వే ఏటా వర్షాకాలంలో నీట మునుగుతున్నాయి. వాటి మీదుగా వరద ప్రవహిస్తుండటంతో వాహన రాకపోకలు స్తంభించిపోతున్నాయి. కాజ్‌వేల స్థానంలో వారధులు నిర్మించాలనే ప్రజలు, ప్రయాణికుల కోరిగా కలగానే మిగిలిపోయింది.

ఎల్లారెడ్డిపేట మండలం పదిర, హరిదాస్‌నగర్ గ్రామాల నడుమ చిట్టివాగుపై ఉన్న కాజ్‌వే ఇది. 2020లో రూ. 20 లక్షల ఎఫ్‌డీఆర్ నిధులతో నిర్మించారు. నిర్మాణంలో సాంకేతిక లోపాల వల్ల వరద తాకిడికి 2021లో కొట్టుకుపోయింది. రూ. లక్షలు వెచ్చించి, మరమ్మతు చేశారు. గత సంవత్సరం, ఈ ఏడాది వరదల తాకిడికి పూర్తిగా ధ్వంసమైంది. దీంతో ఆ మార్గంలో రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

ప్రతిపాదనలు పంపించాం– శ్రీనివాస్, డీఈ, పంచాయతీరాజ్‌శాఖ

కాజ్‌వేల మరమ్మతు కోసం ఎఫ్‌డీఆర్ నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. బాకురుపల్లి నుంచి బాకురుపల్లితండా మధ్య కాజ్‌వే మరమ్మతుకు రూ. 4 లక్షలు, కోరుట్లపేట పారేటి వాగుపై కాజ్‌వేకు రూ. 5 లక్షలు కావాలని కోరాం. పదిర, హరిదాస్‌నగర్ గ్రామాల నడుమ చిట్టివాగుపై వంతెన నిర్మాణానికి రూ. 6 కోట్లు, రాగట్లపల్లి నుంచి నారాయణపూర్ వెళ్లే దారిలో రోడ్డు పూర్తిగా ధ్వంసమవగా కొత్తగా తారురోడ్డు నిర్మాణానికి రూ. 90 లక్షలు, అక్కపల్లి వద్ద వంతెనకు రూ. 1.50 కోట్లకు ప్రతిపాదనలు అందజేశాం. త్వరలోనే నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది.

# ఉత్కంఠకు తెర

హుజూర్‌నగర్ : మిల్లర్లు తమ డిమాండ్లు తీర్చాలని పట్టుబడుతున్న క్రమంలో.. కోతలు ప్రారంభం కాగానే ధాన్యం తీసుకునేందుకు మిల్లర్లు ముందుకు రాకపోతే పరిస్థితి ఎలా ఉంటుందో అన్న ఆందోళనకు తెర పడింది. ఒక్కసారిగా ధాన్యం మార్కెట్‌లోకి వస్తే పరిస్థితి గందరగోళంగా మారుతుందని అటు అధికారులు, రైతులు కొంతమేర ఆందోళనగా ఉన్నారు. తాజాగా ప్రభుత్వం ధాన్యాన్ని నేరుగా మిల్లులకు కేటాయించకుండా కొనుగోలు కేంద్రాల నుంచి గోదాములకు తరలించాలని నిర్ణయం తీసుకోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. చర్చల దశలో మిల్లర్ల సమస్యలు..

రాష్ట్ర సబ్ కమిటీ ముందు మిల్లర్లు పలు సమస్యలు ఉంచారు. సన్నధాన్యం మిల్లింగ్ చేసినప్పుడు 67 శాతం బియ్యం రావని, 58 శాతం బియ్యం, 9 శాతం నూకలు ఇస్తామని, తేమ శాతం 14 శాతం మార్చాలని అడుగుతున్నారు. 32 రకాల ధాన్యాన్ని సన్న రకాలుగా గుర్తించాలని, మిల్లింగ్ ఛార్జీలు, ధాన్యం నిల్వ చేసిన ఛార్జీలు ఇవ్వాలని పట్టుబడుతున్నారు. ఇవి చర్చల దశలో ఉన్నాయి.

వీటిపై నిర్ణయం రావడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉండటంతో ప్రభుత్వంపై ఒత్తిడి లేకుండా కొనుగోలు చేసిన ధాన్యం గోదాములలో నిల్వ చేసి చర్చలు ముగిసిన తరువాత మిల్లులకు కేటాయించేందుకు పౌరసరఫరాలశాఖ సిద్ధమవుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4,83,560 మెట్రిక్ టన్నుల సన్న రకాల ధాన్యం, 10,69,029 మెట్రిక్ టన్నుల దొడ్డు రకాల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దొడ్డు రకాల ధాన్యంతో ఇబ్బంది లేకపోయినా సన్నరకాల ధాన్యాన్ని నిల్వ చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ మేరకు గోదాముల పరిస్థితి ఏమిటన్న విషయంపై అధికారులు దృష్టి సారించారు. ప్రస్తుతం గోదాములో నిల్వ చేసి నిబంధనల ప్రకారం గడువు అయి పోయిన వారిని వెంటనే ఖాళీ చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

గోదాముల పరిస్థితి ఏమిటి?

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని రకాల గోదాములు కలిపి 59 ఉన్నాయి. ఉమ్మడి జిల్లా అధికారులు సెప్టెంబరు రెండో వారంలో రాష్ట్ర అధికారులకు ఇచ్చిన సమాచారం ప్రకారం ఉమ్మడి జిల్లాలో 9,49,359 మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉండగా.. అందులో 6,51,685 మెట్రిక్ టన్నుల మేర గోదాముల్లో నిల్వలు ఉన్నాయి. కేవలం 2,97,674 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం మాత్రమే ఖాళీగా ఉంది. అధికారులు ఇప్పుడు పాత నిల్వలను ఖాళీ చేయించుకుంటేనే ప్రభుత్వ ఆలోచన ప్రకారం నిల్వ చేసుకునే అవకాశం దొరుకుతుంది. నల్గొండ, యాదాద్రి జిల్లాల్లో అత్యధికంగా గోదాము ఉపయోగంలో ఉన్నందున దాన్ని ఖాళీ చేయించుకునేందుకు అధికారులు కరసత్తు చేయాల్సి ఉంది.



# షిండేనా.. ఫడ్నవీసా.. మహారాష్ట్ర తదుపరి సీఎం ఎవరు..?

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో మహాయుతి కూటమి స్పష్టమైన ఆధిక్యంలో ఉంది. మొత్తం 288 స్థానాలకు గానూ 220 స్థానాల్లో ముందంజలో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మహాయుతి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్న తరుణంలో తదుపరి ముఖ్యమంత్రి ఎవరన్నది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. కూటమిలోని పెద్ద పార్టీ అయిన బీజేపీనే ఈ సారి సీఎం పదవి చేపడుతుందన్న ప్రచారం కూడా జరుగుతోంది. కూటమిలో బీజేపీకే అత్యధిక సీట్లు వచ్చాయి. మొత్తం 220 స్థానాల్లో బీజేపీ 128 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. దీంతో ప్రస్తుతం డిప్యూటీ సీఎంగా ఉన్న దేవేంద్ర ఫడ్నవీసే బీజేపీ తరఫున మహా తదుపరి సీఎం అయ్యే అవకాశం ఉందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అదే సమయంలో ఫడ్నవీస్ మద్దతుదారులు సైతం ఇదే డిమాండ్ చేస్తున్నారు.

**ఫడ్నవీసే మహా తదుపరి సీఎం..** మహారాష్ట్ర తదుపరి సీఎంగా ఫడ్నవీసే బాధ్యతలు చేపడతారంటూ బీజేపీ నేత ప్రవీణ్ దకేకర్ కూడా వెల్లడించారు. ఈ నేపథ్యంలో మహా తదుపరి సీఎంగా ఫడ్నవీసే ఖాయంగా తెలుస్తోంది. ఇదే విషయమైన ఫడ్నవీస్ తల్లి సరితా ఫడ్నవీస్ స్పందించారు. కచ్చితంగా తన కుమారుడే సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. దేవేంద్ర ఫడ్నవీస్ 24 గంటలూ కష్టపడి పనిచేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో తన కుమారుడు పెద్ద నాయకుడిగా ఎదిగినందుకు సంతోషంగా ఉందన్నారు.

**సీఎం ఎవరనేది కూర్చుని నిర్ణయిస్తాం : ఏక్‌నాథ్ షిండే...** మరోవైపు ఏక్‌నాథ్ షిండే నే మహారాష్ట్ర తదుపరి సీఎం అని ఆయన వర్గం స్పష్టం చేస్తోంది. ఈ క్రమంలో సీఎం ఏక్‌నాథ్ షిండే మీడియా ముందుకు వచ్చి మాట్లాడారు. అధికార కూటమికే మళ్లీ పట్టం కట్టిన మహారాష్ట్ర ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మళ్లీ సీఎం మీరే అవుతారా అన్న ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ.. కూటమిలోని మూడు పార్టీల నేతలం కూర్చుని సీఎం ఎవరనేది నిర్ణయిస్తామని చెప్పారు. ఈసారి పెద్ద పార్టీ అయిన బీజేపీ సీఎం పదవి చేపడుతుందా..? అని మీడియా ప్రశ్నించగా 'కూటమిలోని పెద్ద పార్టీయే సీఎం పదవి చేపట్టాలనే రూల్ ఏం లేదుగా..!' అని షిండే వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో సీఎం సీటు ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారింది. గెలుపు సంతోషం కంటే కూటమికి నేతలకు సీఎం అభ్యర్థి ఎంపికే కష్టతరంగా మారబోతోందంటూ చర్చించుకుంటున్నారు.

**ముంబైకి కేంద్ర పరిశీలకులు...** మరోవైపు ప్రభుత్వ ఏర్పాటు నేపథ్యంలో బీజేపీ అగ్రనాయకత్వం రేపు ముంబైకి కేంద్ర పరిశీలకులను పంపనున్నట్లు తెలిసింది. వారు కూటమి పార్టీలతో చర్చలు జరపనున్నారు. కూటమిలోని మూడు పార్టీల నేతలతో సమావేశం కానున్నారు. ఈ సమావేశంలోనే సీఎం ఎవరన్నదానిపై స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**26న కొత్త సీఎం ప్రమాణ స్వీకారం..** మరోవైపు రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు బీజేపీ సిద్ధమైనట్లు తెలిసింది. ఇందులో భాగంగానే ఈనెల 25న లెజిస్లేటివ్ పార్టీ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు సమాచారం. ఈ సమావేశంలో సీఎం అభ్యర్థిని ఎన్నుకోనున్నారు. ఆ తర్వాతి రోజు అంటే ఈనెల 26న కొత్త సీఎం ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలను ఊటంకిస్తూ జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి. మహా అసెంబ్లీ గడువు ఈనెల 26తో ముగియనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గెలిచిన వాళ్లు 72 గంటల్లోగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.




## మహారాష్ట్రలో మహాయుతి ఘన విజయం.. ఝార్ఖండ్‌లో జేఎంఎం జయకేతనం

ముంబయి, రాంచీ: మహారాష్ట్ర, ఝార్ఖండ్ శాసనసభల ఎన్నికల ఫలితాలు శనివారం వెలువడ్డాయి. మహారాష్ట్రలో అధికార మహాయుతి కూటమి అఖండ విజయం సాధించింది. ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ కూటమి కనీస పోటీ ఇవ్వలేకపోయింది. అటు ఝార్ఖండ్‌లో ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు భిన్నంగా జేఎంఎం కూటమి జోరు ప్రదర్శించింది.



## మహారాష్ట్రలోనూ పవన్ కల్యాణ్ హవా.. పవన్ ప్రచారం చేసిన స్థానాల్లో బీజేపీ దూకుడు..

అందరి అంచనాలకు అనుగుణంగానే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి భారీ విజయం దిశగా సాగుతోంది. ప్రస్తుతానికి మహారాష్ట్రలో మహాయుతి కూటమి 37 స్థానాలను కైవసం చేసుకుంది.

మరో 183 స్థానాల్లో అధిక్యంలో ఉంది. ప్రతిపక్ష ఎంవీఏ కూటమి ఆరు స్థానాల్లో గెలుపొందింది. మరో 51 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. ఈ నేపథ్యంలో మహారాష్ట్రలో మహాయుతి కూటమి విజయం దాదాపు ఖరారు అయింది. ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎన్డీయే తరఫున మహారాష్ట్రలో పలు అసెంబ్లీ స్థానాల్లో ప్రచారం నిర్వహించారు. సనాతన ధర్మాన్ని రక్షించాలని, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ మహారాష్ట్రలోని పలుచోట్ల జరిగిన బహిరంగ సభల్లో పవన్ కల్యాణ్ మాట్లాడారు. ప్రచారంలో ముమ్మరంగా పాల్గొని అక్కడి తెలుగు ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. పుణె, బల్లార్ పూర్, షోలాపూర్, డెగ్లూర్, లాతూర్‌లలో పవన్ కల్యాణ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ప్రస్తుతం వెలువడుతున్న ఫలితాల ప్రకారం పుణె, బల్లార్ పూర్, షోలాపూర్‌లలో మహాయుతి కూటమి అభ్యర్థులు ఆధిక్యంలో ఉన్నారు. డెగ్లూర్, లాతూర్‌లలో ప్రత్యర్థులతో హోరాహోరీగా తలపడుతున్నారు. దీంతో పవన్ కల్యాణ్ ప్రచారం వల్ల మేలు జరిగిందని బీజేపీ కూటమి అభ్యర్థులు మాట్లాడుకుంటున్నారు.




వయనాడ్: కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంకగాంధీ తొలి అడుగులోనే విజయఢంకా మోగించారు. వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికలో భారీ విజయాన్ని దక్కించుకున్నారు. ఈ స్థానంలో తన సమీప అభ్యర్థిపై 3.94లక్షలకు పైగా ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఈ స్థానంలో తన సోదరుడు రాహుల్ గాంధీ సాధించిన 3.64లక్షల ఓట్ల మెజార్టీని ప్రియాంక దాటేశారు. వయనాడ్‌లో 2019 లోక్‌సభ ఎన్నికల్లో సీపీఐ నేత పీపీ సునీర్‌పై 4.3 లక్షల మెజార్టీతో రాహుల్ గాంధీ విజయం సాధించారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో వయనాడ్ నుంచి పోటీ చేసిన రాహుల్ గాంధీ.. సీపీఐ నాయకురాలు అన్నీ రాజాపై 3.64 లక్షల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. రాయ్‌బరేలీలోనూ విజయం సాధించడంతో ఆ తర్వాత ఈ స్థానాన్ని వదులుకున్నారు. దీంతో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. అనంతరం ప్రియాంక రంగంలోకి దిగారు. ఝార?ండ్ తొలి విడత ఎన్నికలతో పాటుగా నవంబర్ 13న ఈ స్థానంలో పోలింగ్ జరిగింది.

## 'మహా' ఎన్నికల ఫలితాలపై చంద్రబాబు హర్షం.. అమిత్‌షాకు ఫోన్



అమరావతి: మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలపై ఏపీ సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఘన విజయం దిశగా దూసుకెళు_తున్న మహాయుతి కూటమికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ శిందే, డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడణవీస్‌కు ఆయన ఫోన్ చేశారు. ఎన్నికల్లో ప్రజలు అపూర్వ విజయం కట్టబెడుతున్నారంటూ శుభాకాంక్షలు చెప్పారు. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల్లో మహాయుతి కూటమి భారీ విజయం దిశగా వెళ్తోంది. ఇప్పటి వరకు వెల్లడైన ఫలితాల ప్రకారం ఆ కూటమి 215 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. ఎంవీఏ కూటమి కేవలం 60 స్థానాల్లోనే ముందంజలో ఉంది. మహాయుతి కూటమి అధికారంలోకి రావడం ఖాయం కావడంతో చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు.

## చంద్రబాబుపై రాళ్ల దాడి కేసు.. పోలీసుల అదుపులో ముగ్గురు

నందిగామ: వైకాపా హయాంలో అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత సీఎం చంద్రబాబుపై ఎన్టీఆర్ జిల్లా నందిగామలో జరిగిన రాళ్ల దాడి కేసులో పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. 2022 నవంబర్ 5న చంద్రబాబు నందిగామలో పర్యటించారు. వాహనంపై అభివాదం చేస్తూ చంద్రబాబు వస్తుండగా వీధి లైట్లు ఆర్పివేసి రాళ్ల దాడి చేశారు. స్థానిక రైతు బజార్ వద్ద చందర్లపాడు రోడ్డులో ఈ ఘటన జరిగింది. ఇందులో చంద్రబాబు చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ మధుసూదనరావుకు గాయాలయ్యాయి. దీనిపై కేసు నమోదైనా వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. తాజాగా పోలీసులు ఈ కేసులో పురోగతి సాధించారు. నందిగామకు చెందిన కనికంటి సజ్జన్ రావు, బెజవాడ కార్తీక్, పరిమి కిశోర్‌లను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు.

## వర్రా రవీందర్‌రెడ్డిని ప్రొద్దుటూరు కోర్టులో హాజరుపరిచిన పోలీసులు

ప్రొద్దుటూరు: వర్రా రవీందర్‌రెడ్డిని పోలీసులు ప్రొద్దుటూరు కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రొద్దుటూరులో నమోదైన కేసులో పీటీ వారెంట్‌పై ఆయన్ను కడప నుంచి తీసుకెళ్లి న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. వర్రా రవీందర్‌రెడ్డిపై వైఎస్సార్ జిల్లావ్యాప్తంగా 10 కేసులు నమోదయ్యాయి. సామాజిక మాధ్యమాల్లో అసభ్యకరమైన పోస్టులు పెట్టడంతో రాష్ట్రవ్యాప్తంగా ఆయనపై 40 కేసులు నమోదయ్యాయి. వర్రా రవీందర్‌రెడ్డి కేసులో నెల్లూరు, భీమవరానికి చెందిన ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకొని పోలీసులు విచారిస్తున్నారు.

వైకాపా అధికారంలో ఉండగా వర్రా రవీంద్రారెడ్డి అడ్డూ అదుపూ లేకుండా మితిమీరి ప్రవర్తించారు. చంద్రబాబు , పవన్‌కల్యాణ్, లోకేశ్, వంగలపూడి అనితపై అసభ్యకరమైన పోస్టులు పెట్టారు. ఆయనపై మంగళగిరి, హైదరాబాద్‌ల్లో పలు కేసులున్నాయి.






## వైసీపీకి మరో బిగ్ షాక్.. రాజీనామా చేసిన మరో ఎమ్మెల్సీ

అమరావతి: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత.. వైసీపీ నేతల్లో అంతర్మథనం మొదలైనట్లుంది. గత ఐదేళ్ల జగన్ పాలన దృష్ట్యా ఏపీలో పార్టీకి భవిష్యత్ లేదనే నిర్ణయానికి ఆ పార్టీ నేతలు వస్తున్నారట. అందుకే.. పక్క చూపులు చూస్తున్నారట. ఇప్పటికే చాలా మంది ముఖ్య నేతలు వైసీపీని వీడగా.. మరికొందరు అదే ఆలోచనలో ఉన్నారు. ఇక కొందరు నేతలైతే అసలు పార్టీలో ఉన్నారో, లేదో కూడా తెలియడం లేదు. పార్టీతో అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే కీలక నేతలు వైసీపీకి రాజీనామాలు చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు మరికొంతమంది కూడా రాజీనామాల బాట పట్టనున్నట్లు సమాచారం. తాజాగా జయ మంగళ వెంకటరమణ ఇవాళ రాజీనామా చేశారు. గత కొంత కాలంగా వైసీపీపై, పార్టీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి వైఖరిని బాహాటంగానే నేతలు విమర్శిస్తున్నారు. ఎమ్మెల్సీ పదవికి జయ మంగళ వెంకటరమణ ఇవాళ(శనివారం) రాజీనామా చేశారు. మండలి ఛైర్మన్‌కు జయమంగళ వెంకట రమణ రాజీనామా లేఖ పంపించారు. అయితే భవిష్యత్తు ప్రణాళికపై తన అనుచరులతో చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. కూటమి పారీల్లోకి వెళ్తారని ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై ఆయన నుంచి స్పష్టత రావాల్సి ఉంది. ఇలా ఎందరో నేతలు ఎన్నికల తర్వాత వైసీపీకి దూరంగా ఉంటున్నారు. ఈ పరిస్థితి బట్టి చూస్తే వైసీపీ దుకాణం త్వరలోనే బంద్ అవడం ఖాయం అని పొలిటికల్ సర్కిల్‌లో టాక్ నడుస్తోంది.

## మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలపై జీవీఎల్ ఆసక్తికర వ్యాఖ్యలు

ఢిల్లీ: మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు బీజేపీకి చాలా ఆనందాన్ని ఇస్తుందని మాజీ ఎంపీ, బీజేపీ సీనియర్ నేత జీవీఎల్ నరసింహారావు తెలిపారు. నరేంద్రమోదీ కూటమికి ప్రజలు పెద్దఎత్తున్న ఓట్లు వేశారని అన్నారు. బీజేపీ మహారాష్ట్రలో సింగిల్‌గానే ఆధిక్యంలో ఉందని వివరించారు. మహారాష్ట్ర చరిత్రలో మొదటిసారిగా పెద్ద ఎత్తున ప్రజలు ఒక తీర్పు ఇచ్చారని చెప్పుకొచ్చారు. మహారాష్ట్ర ప్రజలు స్పష్టమైన అద్భుతమైన తీర్పు బీజేపీకి ఇచ్చారని అన్నారు.మహారాష్ట్రలో దాదాపు విజయం ఖరారు అయిందని చెప్పారు. బీజేపీ 149 స్థానాల్లో పోటీ చేసిందని, 139 స్థానాలకు వెళ్లే అవకాశం ఉందని తెలిపారు.

**మోదీకి మరోసారి ప్రజలు పట్టం కట్టారు..** కాంగ్రెస్ 103 స్థానాల్లో పోటీ చేసిందని అన్నారు. కాంగ్రెస్ కేవలం 21 స్థానాలకు మాత్రమే పరిమితం అయిందని చెప్పారు. మోదీకి మరోసారి ప్రజలు పట్టం కట్టారని అన్నారు. హర్యానా ఎన్నికల తర్వాత తమకు మహారాష్ట్రలో ప్రజలు ఓట్లు వేశారని చెప్పారు. రానున్న రోజుల్లో కూడా అధికారం బీజేపీదే ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీలో ప్రజలు టీడీపీ జనసేన బీజేపీ కూటమికి పెద్ద ఎత్తున ఓట్లు వేశారని అన్నారు. ప్రజలు బీజేపీకి పూర్తిస్థాయి మద్దతు ఇస్తున్నారని చెప్పారు. ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన మెజార్టీ తమ కూటమి పార్టీలకు ఇస్తున్నారని తెలిపారు. ఇది కేంద్ర ప్రభుత్వాన్ని బలపరచడం మోదీ అభివృద్ధిని చూసి ప్రజలు ఓటు వేయడమని అన్నారు. దేశానికి మహారాష్ట్ర ఒక ఆర్థిక పట్టు అని చెప్పారు. మహారాష్ట్రలో మోదీ నాయకత్వంలో మరోసారి ప్రభుత్వం ఏర్పడుతుందని జీవీఎల్ నరసింహారావు పేర్కొన్నారు.

## ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు.. నలుగురి మృతి.. 8 మందికి గాయాలు

గార్లదిన్నె: అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం తలగాసుపల్లె వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. వ్యవసాయ కూలీలతో వెళ్తున్న ఆటోను ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో.. నలుగురు ప్రాణాలు కోల్పోగా 8 మందికి గాయాలయ్యాయి.

ఘటనాస్థలిలోనే ఇద్దరు మృతి చెందగా.. ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మరో ఇద్దరు చనిపోయారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. కుట్లూరు మండలం నెల్లుట్ల గ్రామానికి చెందిన 12 మంది వ్యవసాయ కూలీలు.. ఆటోలో గార్లదిన్నె పని కోసం వచ్చారు. తిరిగి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఆటోను ఢీ కొట్టింది. రాంజమనమ్మ, బాల గద్దయ్య అక్కడికక్కడే మృతి చెందగా.. ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో డి. నాగమ్మ, నాగమ్మ ప్రాణాలు కోల్పోయారు. క్షతగాత్రులకు అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. సంఘటన స్థలిని జిల్లా ఎస్పీ, డీఎస్పీ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఆర్టీసీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

# మిల్కీ కాదు గోల్డెన్ బ్యూటీ

మిల్కీ బ్యూటీ తమన్నా సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టి సుదీర్ఘ కాలం అవుతున్నా ఇప్పటికీ వరుస సినిమాలతో, సిరీస్‌లతో బిజీ బిజీగానే ఉంటుంది. తాజాగా ఈమె బాలీవుడ్‌లో చేసిన సినిమా ప్రమోషన్‌లో భాగంగా పలు ఆసక్తికర పోస్ట్‌లను, ఫోటోలను షేర్ చేస్తూ వస్తోంది. ఈ మధ్య కాలంలో టాలీవుడ్‌లో ఈ అమ్మడు సినిమాలు చేయక పోయినా అభిమానులు సోషల్ మీడియా ద్వారా ఆమె షేర్ చేస్తున్న ఫోటోలు, వీడియోలతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నెట్టింట తమన్నాను ఎప్పుడూ అభిమానిస్తూ, ఫాలో అవుతున్న వారు చాలా మంది ఉన్నారు. తాజాగా వారి కోసం మరో అందాల ఆరబోత ఫోటో షూట్‌ను ముద్దుగుమ్మ తమన్నా షేర్ చేసింది. ఈసారి మిల్కీ బ్యూటీ తమన్నా క్లీ వేజ్ షో చేస్తూ బంగారు వర్ణపు డ్రెస్‌లో మెరిసింది. నేను గోల్డెన్ గర్ల్ అంటూ తనకు తాను ట్యాగ్ ఇచ్చుకుని అందమైన ఫోటోలను షేర్ చేసిన ముద్దుగుమ్మ తమన్నా పోటోలు ఎప్పటిలాగే వైరల్ అవుతున్నాయి. ఇండస్ట్రీలో వచ్చి ఇన్నాళ్లు అయినా, మూడు పదుల వయసులోనూ మిల్కీ బ్యూటీ ఈ స్థాయి అందం ఎలా సాధ్యం అర్థం కాదు అంటూ నెట్టింట కొందరు కామెంట్ చేస్తూ ఉంటారు. తాజాగా మరోసారి ఈ అమ్మడి అందాల ఆరబోత ఫోటోలు వైరల్ అవుతున్న నేపథ్యంలో పాపం టాలీవుడ్ లో ఆఫర్లు దక్కక పోవడం



విచారకరం అంటూ ఆవేదన చేస్తున్న వారు చాలా మంది ఉన్నారు. మిల్కీ బ్యూటీ తమన్నా సీనియర్ హీరోలకు జోడీగా అయినా వరుసగా సినిమాలు చేస్తే బాగుంటుంది అనే అభిప్రాయంను వ్యక్తం చేస్తున్న వారు చాలా మంది ఉన్నారు. వెబ్ సిరీస్‌లతో పాటు ప్రత్యేక పాటల్లోనూ కనిపించేందుకు ఎలాంటి మొహమాటం లేదని చెబుతూ ఉన్న ఈ అమ్మడు మరోసారి ఒక స్టార్ హీరో సినిమాలో ఐటెం సాంగ్ ను చేసేందుకు రెడీ అయ్యిందని తెలుస్తోంది. హిందీలో ఈమె వరుసగా సినిమాలు చేస్తోంది. కానీ ఇప్పటి వరకు ఈమెకు సాలిడ్ సక్సెస్, మంచి గుర్తింపు దక్కించుకోలేక పోయింది. హిందీతో పాటు ఇతర భాషల్లో ఆఫర్లు సొంతం చేసుకుంటూనే మరో వైపు సోషల్ మీడియాలో ఇలాంటి అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా తమన్నా తన ఉనికిని కాపాడుకుంటూ వస్తుంది. మరో అయిదు పదేళ్ల పాటు తమన్నా ఇదే అందంతో, ఇంతే బిజీగా ఉండాలని, మరిన్ని సినిమా ఆఫర్లు తమన్నాకు రావాలని అభిమానులు కోరుకుంటున్నారు. ప్రస్తుతం మిస్ అయిన స్టార్ హీరోల సినిమాలు ఈమెకు మళ్లీ దక్కాలని కొందరు కోరుకుంటున్నారు. టాలీవుడ్‌లో మిల్కీ బ్యూటీ ఇదే అందంను కంటిన్యూ చేస్తే బిజీ అయ్యేనా చూడాలి.

# రాశీ కిల్లర్ భంగిమలు

నేటి తరంలో తీవ్రమైన పోటీ ప్రపంచంలో తెలివిగా కెరీర్ బండిని నడిపిస్తున్న భామ రాశీ ఖన్నా. దశాబ్ద కాలంగా ఈ బ్యూటీ టాలీవుడ్‌లో కెరీర్ జర్నీ సాగించింది. తమిళం, హిందీ భాషల్లోను వీలున్నప్పుడల్లా నటిస్తూనే ఉంది. మూడు భాషల్లో అవకాశాలను అంది పుచ్చుకుంటోంది. ఒక్క అడుగుతో మొదలైన కెరీర్ అంచెలంచెలుగా ఎదిగింది. రాశీ విభిన్నమైన పాత్రల్లో నటించి తనదైన అందం, నట ప్రదర్శనతో మైమరిపించింది. ఇదే విషయాన్ని రాశీ తెలివైన పంథాలో అభిమానుల కోసం వెల్లడించింది. మద్రాస్ కేఫ్ నుండి ది సబర్మతి రిపోర్ట్ వరకు, ఇది చాలా సుసంపన్నమైన ప్రయాణం. వైవిధ్యభరితమైన పాత్రలను పోషించినందుకు గౌరవం పొందాను.. వినయంగా ఉంటాను. ఎక్స్‌ట్రార్డినరీ సెన్సేషనల్ పెర్ఫార్మర్ అవార్డుకు ఏnexbrands.incకి ధన్యవాదాలు అని రాసింది. రాశీ ఖన్నా తన అవార్డును ప్రదర్శిస్తూ ఫోజులిచ్చింది. ఈ ఫోటోషూట్



కోసం వంగ పువ్వు (బ్రింజాల్) రంగు ఫ్రాక్ ధరించి వయ్యారంగా హొయలు పోయింది. పరిమిత మేకప్ తో కనిపించిన రాశీ హాఫ్ షోల్డర్ దుస్తుల్లో సంథింగ్ స్పెషల్ గా కనిపిస్తోంది. అది థై స్లిట్ ఫ్రాక్. హై హీల్స్ ధరించి ఫోజులిచ్చింది. ముఖ్యంగా ఆ మెడలో అందమైన లాకెట్ తన గ్లామ్ ని పదింతలు పెంచిందని చెప్పాలి. రాశీ ఇటీవల మూడు భాషల్లో నటించింది. రాజ్ అండ్ డీకే వెబ్ సిరీస్ ఫర్జీలోను కీలక పాత్రను పోషించింది. మునుముందు మరిన్ని వెబ్ సిరీస్ లకు సంతకాలు చేయనుందని తెలుస్తోంది. తెలుసు కదా.. అగాథియా లాంటి చిత్రాల్లోను నటిస్తోంది.




# కిస్ కిసిక్కా.. చిన్న బిట్టుతోనే వైబ్ ఇచ్చారుగా...



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుష్ప రాజ్‌గా, డ్యాన్సింగ్ క్వీన్ శ్రీలీల గ్లామర్ అండ్ టాలెంట్‌తో ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించేందుకు రాబోతున్నారు. సినిమాలోని స్పెషల్ కిస్సిక్ సాంగ్ ఇప్పటికే అందరిలో భారీ అంచనాలు సృష్టించింది. ఇక లేటెస్ట్ గా ఈ స్పెషల్ సాంగ్ ప్రోమో విడుదల కాగా, ఒక్క చిన్న బిట్‌తోనే ఓ రేంజ్ వైబ్ క్రియేట్ చేసింది. దేవిశ్రీ ప్రసాద్ కంపోజ్ చేసిన ట్యూన్ సాంగ్‌కు అసలైన బజ్ ఇవ్వగా, ఫ్యాన్స్‌లో మరింత ఎగ్జయిట్‌మెంట్ పెరిగింది. ఈ సాంగ్‌లో అల్లు అర్జున్ అటిట్యూడ్, శ్రీలీల ఎనర్జీ మరో లెవెల్‌లో కనిపించనున్నట్లు పోస్టర్ ద్వారా క్లారిటీ వచ్చేసింది. ఇక చిన్న ప్రోమోలో చూపిన విజువల్స్ గ్రాండ్ గా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. బన్నీ స్వాగ్, శ్రీలీల స్టెప్పులు అందరి దృష్టిని ఆకర్షిస్తాయని మేకర్స్ హింట్ ఇచ్చేశారు. "ఊ అంటావా మావ" సాంగ్‌తో పుష్ప మొదటి భాగంలో దేవిశ్రీ ప్రసాద్ సంగీతానికి ఊహించని రెస్పాన్స్ దక్కింది, ఇప్పుడు కిస్సిక్ సాంగ్ అదే మ్యాజిక్ రిపీట్ చేస్తుందా అని అందరూ ఎదురు చూస్తున్నారు. స్పెషల్ సాంగ్ కు సంబంధించిన న్యూ పోస్టర్‌కి కూడా సోషల్ మీడియాలో సూపర్ రెస్పాన్స్ వస్తోంది. పోస్టర్ లలో బన్నీ, శ్రీలీల అద్భుతమైన అవుట్‌ఫిట్స్‌లో కనిపించగా, వాళ్ల కెమిస్ట్రీ ఆడియన్స్‌ను తెగ ఆకట్టుకుంటోంది. డ్యాన్స్ ఫ్లోర్ మీద బన్నీ స్టెప్పుల దుమ్ము రేపుతుందనడానికి ఈ ప్రోమోలో క్లారిటీ వచ్చేసింది. సాంగ్ మొత్తం చూస్తే మరింత థ్రిల్ ఉండబోతుందని ఆడియన్స్ భావిస్తున్నారు. మేకర్స్ ఈ సాంగ్ కోసం ఖర్చుకు వెనకాడకుండా భారీ సెట్స్ వేసి చిత్రీకరించారు. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సాంగ్ ఆడియన్స్‌ను థియేటర్‌కి రప్పించే కీలక ఎలిమెంట్ అవుతుందని అందరూ నమ్ముతున్నారు. మరోవైపు రష్మిక మందన్నా, ఫహాద్ ఫాజిల్ వంటి నటీనటులు ఉన్న ఈ చిత్రానికి కూడా దేవిశ్రీ ప్రసాద్ కంపోజ్ చేస్తున్న సంగీతం కీలక ఆకర్షణ. ఫుల్ సాంగ్ రేపు సాయంత్రం 7:02కి రిలీజ్ చేయబోతున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. డిసెంబర్ 5న విడుదల కానున్న పుష్ప 2: ది రూల్ గురించి ఇప్పటికే పాన్ ఇండియా లెవెల్లో భారీ అంచనాలు ఉన్నాయి.

ఈ సాంగ్ ఆ అంచనాలను మరింత పెంచుతుందని అంతా ఆశిస్తున్నారు. మొత్తానికి, ఈ పాట థియేటర్లలో పండగ వాతావరణం తెస్తుందని ఎటువంటి సందేహం లేదు.

# నయనతార అన్ని కోట్ల డీల్ కుదుర్చుకుందా?



సౌత్ స్టార్ హీరోయిన్ నయనతార జీవితం ఆధారంగా రూపొందించిన డాక్యుమెంటరీ చిత్రం "బియాండ్ ది ఫెయిరీ టేల్". ఆమె 40వ పుట్టినరోజును పురస్కరించుకుని ఇటీవలే నెట్ ఫ్లిక్స్ ఓటీటీ వేదికగా స్ట్రీమింగ్ కు వచ్చేసింది. హీరో ధనుష్ తో వివాదం కారణంగా ఈ డాక్యుమెంటరీ విడుదలకు ముందు కావాల్సినంత పబ్లిసిటీ దొరికింది. మహేష్ బాబు లాంటి పలువురు స్టార్స్ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడంతో జనాల దృష్టి ఈ ఫిల్మ్ మీద పడింది. 'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' డాక్యుమెంటరీలో ఆమె సినీ కెరీర్, వ్యక్తిగత జీవితంలోని కీలకమైన అంశాలను ఒక కథగా చూపించారు. ఇందులో నయన్ ఫ్యామిలీ వివరాలు, కాలేజీ డేస్ లో పార్ట్‌టైమ్‌గా మోడలింగ్ చేయడం, ఒక జ్యువెలరీ యాడ్ ద్వారా సినిమా ఛాన్స్ రావడం, సినీ కెరీర్ లో ఎదుర్కొన్న ఇబ్బందులు, లేడీ సూపర్ స్టార్ గా ఎదిగిన వైనం, డేటింగ్ లైఫ్ ను కవర్ చేశారు. అలానే డైరెక్టర్ విఘ్నేష్ శివన్ తో పరిచయం, ప్రేమాయణం, పెళ్ళికి ముందు వీరి లైఫ్ లో జరిగిన విషయాలు, వివాహ బంధంలో అడుగుపెట్టడం, పెళ్ళి సంగతులను ప్రముఖంగా చర్చించారు. అయితే నయనతార తన డాక్యుమెంటరీ రూపొందించడానికి భారీ ఓటీటీ డీల్ కుదుర్చుకున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. నెట్‌ఫ్లిక్స్ సంస్థ రూ.25 – 30 కోట్లు చెల్లించినట్లు టాక్ వినిపిస్తోంది. ఇందులో భాగంగా నయన్ – విఘ్నేష్ శివన్ దంపతులు తమ వ్యక్తిగతమైన పెళ్ళి హక్కులను కూడా విక్రయించినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. అందుకే ఈ వెడ్డింగ్ కి మీడియాని కూడా అనుమతించలేదని, వీరి పెళ్లికి సంబంధించిన ఎలాంటి వీడియోలు ఫోటోలు బయటకు రాలేదని టాక్. నయనతార డాక్యుమెంటరీకి అమిత్ కృష్ణ దర్శకత్వం వహించారు. దాదాపు 1 గంట 22 నిమిషాల నిడివితో ఈ చిత్రాన్ని రూపొందించారు. ఇందులో ఆమె తల్లి ఓమన కురియన్, సోదరుడు లెను కురియన్, భర్త విఘ్నేష్ శివన్‌తో పాటు అక్కినేని నాగార్జున, రానా దగ్గుబాటి, రాధికా శరత్ కుమార్, విజయ్ సేతుపతి, తాప్సీ, తమన్నా భాటియా వంటి సినీ సెలబ్రిటీలు భాగం అయ్యారు. నయన్ తో తనకున్న అనుబంధాన్ని, ఆమెపై ఉన్న అభిప్రాయాలను వీడియో రూపంలో పంచుకున్నారు. ఈ డాక్యుమెంటరీపై పలువురు పాజిటివ్ గా స్పందిస్తుంటే.. మరికొందరు మాత్రం ఏమంత గొప్పగా లేదని, ఎమోషన్స్ పండలేదని అంటున్నారు. ఇదిలా ఉంటే, నయనతార డాక్యుమెంటరీలో 'నాను రౌడీ దాన్' సినిమా క్లిప్పింగ్స్ ఉపయోగించుకోడానికి నిర్మాత ధనుష్ అనుమతి నిరాకరించినట్లు తెలుస్తోంది. ఆయన పర్మిషన్ లేకుండానే 3 సెకెండ్ల బీటీఎస్ విజువల్స్ ను ట్రైలర్ లో వాదినందుకు, ధనుష్ రూ.10 కోట్ల నష్టపరిహారం కోరుతూ లీగల్ నోటీసు పంపించినట్లుగా నయన్ తెలిపింది. ఈ మేరకు మూడు పేజీల ఓపెన్ లెటర్ రాసి ధనుష్ మీద తీవ్ర విమర్శలు చేసింది. నయనతార పోస్టును లైక్ చేయడం ద్వారా చాలా మంది హీరోయిన్లు ఆమెకు మద్దతు తెలిపారు. దీనిపై ధనుష్ స్పందించనప్పటికీ, సోషల్ మీడియాలో ఆయనకు సపోర్టు లభిస్తోంది. కొసమెరుపు ఏమిటంటే, 'బియాండ్ ది ఫెయిరీ టేల్' లో 'నేనూ రౌడీనే' సెట్స్ లోని 37 సెకండ్ల విజువల్స్ ను ఉపయోగించారు

# చీరకట్టులో కవ్విస్తున్న రుక్మిణి అందం

కన్నడ భామ రుక్మిణి వసంత్ 'సప్తసాగరాలు దాటి' మూవీ సిరీస్ తో మంచి గుర్తింపు అందుకుంది. అందులో సెటిల్డ్ పెర్ఫార్మెన్స్ తో ఆకట్టుకుంది. ఈ సినిమా తర్వాత కన్నడ నాట రుక్మిణి స్టార్ట్ హీరోయిన్ గా మారిపోయింది. ఇక తెలుగు, తమిళ్ భాషలలో కూడా తెరంగేట్రం చేసింది. తెలుగులోకి ఇప్పటికే 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' సినిమాతో రుక్మిణి హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. ఈ మూవీ పెద్దగా ఆకట్టుకోలేదు. కన్నడంలో 'బగీరా' మూవీతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ మూవీ డిజాస్టర్ అయ్యింది. శివరాజ్ కుమార్ తో 'భారతి రంగల్' మూవీ రీసెంట్ గా రిలీజ్ అయ్యి పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. ఇక తమిళంలో విజయ్ సేతుపతి కి జోడీగా 'ఏస్' అనే సినిమా చేస్తోంది. అలాగే శివ కార్తికేయన్ ఏ ఆర్ మురుగదాస్ కాంబినేషన్ లో తెరకెక్కుతోన్న చిత్రంలో కూడా రుక్మిణి



వసంత్ హీరోయిన్ గా చేస్తోంది. తెలుగులో కొన్ని సినిమాలు డిస్కషన్ స్టేజ్ లో ఉన్నాయని తెలుస్తోంది. ఇలా మెల్లగా ఒక్కో మెట్టు ఎక్కుతూ తన టాలెంట్ తో రుక్మిణి వసంత్ అందరికి చేరువ అవుతోంది. మరీ ఎక్కువగా గ్లామర్ అవుట్ ఫిట్ లతో కనిపించకపోయిన చక్కనైన చీరకట్టులో కూడా రుక్మిణి వసంత్ సమ్మోహనం చేస్తోంది. అందుకే ఆమెకి కుర్రాళ్ళు ఫ్యాన్స్ గా మారిపోతున్నారు. ఈ బ్యూటీని తెలుగులో మంచి సక్సెస్ ఫుల్ మూవీలో చూడాలని ఆమె ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. ఇదిలా ఉంటే రుక్మిణి వసంత్ ఇన్ స్టాగ్రామ్ లో యాక్టివ్ గా ఉంటుంది. రెగ్యులర్ గా తన అప్డేట్స్ ని షేర్ చేస్తూ ఉంటుంది. తాజాగా ఆమె చేసిన బగీరా మూవీ ఓటీటీలోకి వచ్చింది. ఇందులో ఆమె లుక్స్ కి సంబందించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. చీరకట్టులో చాలా చక్కగా రుక్మిణి ఉందనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. మెస్మరైజ్ చేసే అందంతో, మాయ చేసే నవ్వుతో ఇట్టే ఆకట్టుకుంటుంది. ఈ ఫోటోలు ప్రస్తుతం ట్రెండ్ అవుతున్నాయి. పాన్ ఇండియా రేంజ్ లో ఒక్క సక్సెస్ పడితే ఆమె రేంజ్ అమాంతం పెరిగిపోతుందని ఫ్యాన్స్ ఎక్స్ పెక్ట్ చేస్తున్నారు.

# ఆషిక రంగనాథ్.. స్లీవ్‌లెస్ టచ్‌తో చీరకట్టు

కన్నడ చిత్రపరిశ్రమ నుంచి తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఆషిక రంగనాథ్, తన అందం, అభినయంతో ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకుంటోంది. అమిగోస్ చిత్రంతో టాలీవుడ్‌కి ఎంట్రీ ఇచ్చిన ఈ కన్నడ బ్యూటీ, మొదటి సినిమాతోనే ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంది. 'ఎన్నో రాత్రులు' పాటలో తన అందం, డ్యాన్స్‌తో యూత్‌ను ఫిదా చేసింది. సినిమాలో ఆమె నటన కూడా పాజిటివ్ కామెంట్స్ అందుకోవడంతో, తనకంటూ ఓ ఫ్యాన్ బేస్‌ను సృష్టించుకుంది. ఆ తర్వాత నాగార్జున సరసన 'నా సామి రంగ' చిత్రంలో వరలక్ష్మి పాత్రలో కనిపించి, తన నటనతో మెప్పించింది. ఈ సినిమా ద్వారా ఆమె టాలీవుడ్‌లో తన క్రేజ్‌ను మరింత పెంచుకుంది. ప్రస్తుతం ఆషిక తెలుగుతో పాటు కన్నడ చిత్రపరిశ్రమలోనూ వరుస అవకాశాలను దక్కించుకుంటోంది.



చేతినిండా ప్రాజెక్టులతో బిజీగా గడుపుతున్న ఆషిక, తన కెరీర్‌ను మరో లెవెల్ కు తీసుకెళ్లడానికి కృషి చేస్తోంది. ఇక సోషల్ మీడియాలో కూడా ఆషిక రంగనాథ్ బాగా యాక్టివ్‌గా ఉంటోంది. తాజాగా ఆమె షేర్ చేసిన లుక్ ఒకటి నెటిజన్లను కట్టిపడేస్తున్నాయి. స్లీవ్‌లెస్ బ్లౌజ్‌తో క్రీమ్ కలర్ ప్లెయిన్ చీరలో దిగిన ఫోటోలు చూస్తుంటే, ఆమె సౌందర్యం మరింత మెరుస్తోందని చెప్పవచ్చు. ఓ ఫోటోలో ఆమె చిరునవ్వు కుర్రకారును ఆకర్షిస్తుండగా, మరో ఫోటోలో ఆషిక కవ్వింపు అందాలతో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. చీరకట్టులో ఆమె అందం మరింత ఆకర్షణీయంగా కనిపిస్తుండటంతో, నెటిజన్లు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. ఆషిక రంగనాథ్‌కు సంబంధించిన అప్‌కమింగ్ ప్రాజెక్టులు కూడా ఆసక్తికరంగా ఉన్నాయి. ఆమె ప్రస్తుతం మెగాస్టార్ నటిస్తున్న 'విశ్వంభర'లో కీలక పాత్రలో కనిపించనుంది. అలాగే సిద్ధార్థ్ హీరోగా తెరకెక్కుతున్న 'మిస్ యూ' చిత్రంలోనూ ఆమె నటిస్తోంది. మరికొన్ని కథలు చర్చల దశలో ఉన్నట్లు తెలుస్తోంది.

# రైతు సదస్సు మూడు రోజులపాటు నిర్వహించండి: సీఎం రేవంత్



హైదరాబాద్: ప్రజా ప్రభుత్వ విజయోత్సవాల్లో భాగంగా మహబూబ్‌నగర్‌లో నవంబర్ 30న జరగనున్న రైతు సదస్సులో రాష్ట్రంలోని రైతులంతా పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ సభను బహిరంగ సభలా కాకుండా.. రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమంలా నిర్వహించాలని సూచించారు. శనివారం ఆయన వ్యవసాయ శాఖపై సమీక్ష నిర్వహించారు. రైతు సదస్సుపై ప్రధానంగా చర్చించారు. వ్యవసాయంలో వచ్చిన అధునాతన సాగు పద్ధతులు, మెలకువలను రైతులకు తెలియజేసేలా వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో స్టాళ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం అభివృద్ధి చేసిన కొత్త వంగడాలు, ఆయిల్ పామ్ కంపెనీల నూతన ఆవిష్కరణలు, వివిధ కంపెనీల వినూత్న ఉత్పత్తులన్నీ స్టాళ్లల్లో ఉంచాలని సీఎం సూచించారు. అధునాతన పరికరాలు, ఎలక్ట్రిక్ ట్రాక్టర్లు, డ్రోన్లు అన్నింటినీ ప్రయోగాత్మక ప్రదర్శనకు సిద్ధంగా ఉంచాలన్నారు. రైతులు అప్పటికప్పుడు వచ్చి వెళ్లేలా కాకుండా, వారికి అవగాహన కల్పించేలా మూడు రోజుల పాటు సదస్సు నిర్వహించాలని సీఎం ఆదేశించారు. 28వ తేదీ నుంచే ఈ స్టాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. దీంతో రాష్ట్రంలోని రైతులు దేశంలో వ్యవసాయ సాగు విధానాల్లో వస్తున్న మార్పులపై అవగాహన పెంచుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, సీఎంవో ప్రత్యేక కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి రఘునందన్ రావు తదితరులు పాల్గొన్నారు.



## తాగునీటి అవసరాలపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

హైదరాబాద్: జలమండలి, ఇరిగేషన్ ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ తాగునీటి అవసరాలకు 20 టీఎంసీల గోదావరి జలాల తరలింపుపై అధికారులతో సమీక్షించారు. కొండపోచమ్మ, మల్లన్నసాగర్ నుంచి నీటి తరలింపుపై నివేదిక ఇవ్వాలని అధికారులను సీఎం ఆదేశించారు. నీటి తరలింపునకు అయ్యే వ్యయం, లభ్యతపై అధ్యయనం చేయాలని సూచించారు. డిసెంబరు 1లోపు టెండర్లకు వెళ్లేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. మిషన్ భగీరథ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సీఎం సూచించారు.

## తెలంగాణలో ప్రజా తిరుగుబాటు రాబోతోంది : బండి సంజయ్



కరీంనగర్ : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో ప్రజా తిరుగుబాటు రాబోతోందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ యుద్ధం ప్రకటించబోతోందన్నారు. మహారాష్ట్రలో ఎన్ని అబద్ధాలు ప్రచారం చేసినా కాంగ్రెస్ కూటమిని నమ్మలేదన్నారు. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల నేపథ్యంలో కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ కూటమి ముక్కలు కావడం ఖాయమన్నారు. తెలంగాణలోనూ కాంగ్రెస్ పార్టీలో లుకలుకలు మొదలుకాబోతున్నాయని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆ పార్టీ ఎమ్మెల్యేలే కూలుస్తారని స్పష్టం చేశారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా మహారాష్ట్రలో పట్టిన గతే పడుతుంది. ఎందుకంటే ఒక్క హామీలను అమలు చేయలేదు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.

## విద్యార్థి శైలజను పరామర్శించిన ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్ : రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి పాఠశాలల పరిస్థితిపై సమీక్షించాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. కుమ్రంభీం అసిఫాబాద్ జిల్లా వాంకిడి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో కలుషితాహారం తిని అస్వస్థతకు గురై నిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థిని శైలజ, ఆమె కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ కవిత పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. విద్యార్థులు ధర్నా చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. 11 నెలల్లోనే 42 మంది విద్యార్థులు మృతి చెందడం బాధాకరమన్నారు. శైలజ పరిస్థితి విషమంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం విద్యార్థిని కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ మరోసారి నవ్వులపాలైంది: కిషన్ రెడ్డి



హైదరాబాద్: దేశ ప్రజల ముందు కాంగ్రెస్ మరోసారి నవ్వుల పాలైందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. మహారాష్ట్ర ప్రజలు భాజపాకు చక్కటి మెజార్టీ కట్టబెట్టారన్నారు. శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "రాహుల్‌గాంధీ మహారాష్ట్రలో విద్వేష ప్రచారం చేశారు. కులం, మతం పేరుతో ప్రజలను విడగొట్టాలని చూశారు. కానీ, ఇండియా కూటమికి మహారాష్ట్ర ప్రజలు తగిన బుద్ధి చెప్పారు. ఈ విజయంతో భాజపా మహారాష్ట్రలో హ్యాట్రిక్ కొట్టింది.

గత ఎన్నికల్లో ప్రజా తీర్పును ఉద్ధవ్ ఠాక్రే వంచించారు. అనేక రాష్ట్రాల్లో రెండోసారి అధికారంలోకి వచ్చాం. కాంగ్రెస్ 3 రాష్ట్రాలకే పరిమితమైంది" అని అన్నారు.

## కేసీఆర్ రికార్డు బ్రేక్ చేస్తున్న కేటీఆర్.. కాంగ్రెస్ నేత షాకింగ్ కామెంట్స్

హైదరాబాద్: మాజీ మంత్రులు కేటీఆర్ హరీష్‌రావు అబద్ధాలు చెప్పడంలో పోటీ పడుతున్నారని తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టుసాయి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో తెలంగాణకు అవార్డు వస్తే మాజీ సీఎం కేసీఆర్ వల్లే అవార్డు వచ్చిందని కేటీఆర్ అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. దినం దినం కేటీఆర్ దిమాక్ చిన్నగా అవుతోందని విమర్శలు చేశారు. ఇవాళ(శనివారం) గాంధీభవన్‌లో మెట్టుసాయి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేటీఆర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రగ్స్, తాగడం వల్లనో కానీ కేటీఆర్ పిచ్చోడిలా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కేటీఆర్ మెదడుకు చిల్లు పడితే తమ ప్రభుత్వం తరపున వైద్యం చేయిస్తామని అన్నారు. కేటీఆర్ మాటలకు మత్స్యకారులు నవ్వుతున్నారని విమర్శించారు. అబద్ధాల యూనివర్సిటీలో పట్టా పొందిన వ్యక్తి కేటీఆర్ అని దెప్పిపొడిచారు. దాచేసిన సత్యం అంటూ అసలు సత్యాన్ని కేటీఆర్ దాచేశారని ఆరోపించారు.కేటీఆర్ జీవితంలో ఒక్కరోజైనా అబద్ధాలు చెప్పకుండా ఉంటాడా అని ప్రశ్నించారు. కేసీఆర్ అబద్ధాల రికార్డు బ్రేక్ చేసేందుకు కేటీఆర్ కష్టపడుతున్నారని అన్నారు. తమ హయాంలో చేసిన పనిని కేంద్ర ప్రభుత్వం గుర్తిస్తే అది తమ ఘనత అంటూ కేటీఆర్ చెప్పుకుంటున్నారని విమర్శించారు. ఇందిరా మహిళా శక్తికి అవార్డు వచ్చింది. అది ఎవరిదో కేటీఆర్ చెప్పాలని అన్నారు.

రేవంత్ ప్రత్యేక శ్రద్ధతో మహిళాభివృద్ధికి పథకం తీసుకువస్తే ఆ క్రెడిట్ మీరు తీసుకుంటారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో మహిళలకు ఇచ్చిన సబ్సిడీని తాము పెంచామని గుర్తుచేశారు. 32 మొబైల్ ఫిష్ క్యాంటీన్లు ప్రారంభించామని గుర్తుచేశారు. రాష్ట్రానికి ఆదాయాన్ని పెంచేందుకు తీసుకున్న నిర్ణయాలకు తమకు అవార్డు వచ్చిందని తెలిపారు. బీమా పథకం ద్వారా 4 లక్షల 16 మంది సభ్యుల జీవితాలు కాపాడేందుకు రూ.139 కోట్లు ప్రీమియం చెల్లించినందుకు అవార్డు వచ్చిందని మెట్టుసాయి పేర్కొన్నారు.




## ఎగ్జిట్ పోల్స్ ఎగ్జాట్ పోల్స్ : కేకే సర్వే సీక్రెట్ ఏమిటి..

ఎన్నికలంటే గుర్తొచ్చేది.. పోలింగ్ పూర్తికాగానే ప్రజలంతా ఎదురుచూసేది ఎగ్జిట్ పోల్స్ గురించి.. ఎగ్జిట్ పోల్స్ ఎగ్జాట్ పోల్స్ కాదని తెలిసినప్పటికీ సర్వే సంస్థల అంచనాలపై ప్రజలు ఆసక్తి చూపిస్తుంటారు. పోలింగ్ తర్వాత ఫలితాల కోసం రెండు నుంచి మూడు రోజులు పట్టనున్న నేపథ్యంలో సర్వే సంస్థలు వెల్లడించే అంచనాలతో అధికారంలోకి ఏ పార్టీ వస్తుందో అంచనా వేస్తుంటారు. సార్వత్రిక ఎన్నికల వేళ ఏపీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై కేకే ఇచ్చిన సర్వే తీవ్ర సంచలనమైంది. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి160కి పైగా వస్తాయని కేకే సర్వే వెల్లడించింది. వాస్తవ ఫలితాలు కేకే సర్వేకు దగ్గరగా వచ్చాయి. ఏ సర్వే సంస్థ ఎన్డీయే కూటమికి కనీసం 150 స్థానాలు ఇవ్వని పక్షంలో ఆంధ్రప్రదేశ్‌లో 160కి పైగా స్థానాల్లో టీడీపీ కూటమి గెలుస్తుందని అంచనాలు ఇవ్వడం అందరినీ ఆశ్చర్యపర్చింది. ఫలితాల తర్వాత కేకే ఎగ్జాట్ సర్వే సంచలనమైంది. ఏపీలో ఎగ్జిట్‌పోల్స్‌తో సంచలనం సృష్టించిన కేకే హర్యానా ఫలితాల్లో ఇచ్చిన అంచనాలు తప్పాయి. హర్యానా ఎన్నికలు ముగిసిన రెండు నెలలు పూర్తికాకముందే జరిగిన మహారాష్ట్ర ఎన్నికల్లో కేకే సర్వే నిజమైంది. నవంబర్ 20వ తేదీన మహారాష్ట్రలో పోలింగ్ ముగియగా.. అదేరోజు సాయంత్రం సర్వే సంస్థలు తమ అంచనాలను వెల్లడించాయి. ఎక్కువ సర్వే సంస్థలు మహాయుతి కూటమి అధికారంలోకి వచ్చే అవకాశం ఉందని అంచనా వేశాయి. కొన్ని సంస్థలు మహా వికాస్ అఘాడీ అధికారంలోకి వచ్చే అవకాశం ఉందని అంచనా వేశాయి. అదే సమయంలో కేకే సర్వే మహాయుతి 225 స్థానాలు గెలిచే అవకాశం ఉందని తన అంచనాలను వెల్లడించింది. ప్రస్తుత ఫలితాలు కేకే అంచనాలకు దగ్గరా ఉండటంతో మరోసారి ఐయామ్ డిఫరెంట్ అని కేకే నిరూపించుకున్నారు.

**సీక్రెట్ ఏమిటి...** కేకే సర్వే ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో సక్సెస్ కావడంతో ఆయన సర్వేపై ప్రజల్లో అంచనాలు పెరిగాయి.

కొన్ని సంస్థలు ఆయన రాళ్లు వేస్తున్నారని విమర్శించినప్పటికీ వాటిని పట్టించుకోలేదు. తన వ్యూహాలను మాత్రమే కేకే నమ్ముకున్నట్లు తెలుస్తోంది. ఎవరెన్ని విమర్శలు, ఆరోపణలు చేసినా పట్టించుకోకుండా ముందుకు వెళ్లారు. దేశ వ్యాప్తంగా తన సంస్థను విస్తరించడంతో పాటు దేశ వ్యాప్తంగా సర్వేల్లో తనదైన మార్క్ చూపిస్తానని చేసిన సవాల్‌కు అనుగుణంగా ముందుకెళ్తున్నారు. కేకే సర్వే ఎగ్జిట్ పోల్స్ ఎగ్జాట్ పోల్స్‌ను ప్రతిబింబించడంతో ఆయన ఎలాంటి వ్యూహాలను అనుసరిస్తున్నారనే ఆసక్తి అందరిలో నెలకొంది. పర్సన్ టు పర్సన్ ఓపీనియన్‌తో పాటు ప్రస్తుత డిజిటల్ యుగంలో సాంకేతికతను ఉపయోగించి సరైన అంచనాలను వెల్లడిస్తున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా మహారాష్ట్ర ఎన్నికల్లో కేకే సర్వే ఓ సంచలనం సృష్టించిందనే అభిప్రాయం అందరిలో వ్యక్తమవుతోంది.



## నువ్వేమైనా చక్రవర్తివా.. నీలాంటోళ్లు ఎంతోమంది కొట్టుకుపోయారు.. రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ధ్వజం

హైదరాబాద్ : సీఎం రేవంత్ రెడ్డి కక్షపూరిత వైఖరి కారణంగా చేయని తప్పునకు చర్లపల్లి జైల్లో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి శిక్ష అనుభవిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. చర్లపల్లి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న పట్నం నరేందర్ రెడ్డితో కేటీఆర్ శనివారం ములాఖత్ అయ్యారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. పేద, గిరిజన, బలహీనవర్గాల రైతుల తరఫున పోరాటం చేసిన పాపానికి జైలు పాలైన మా నరేందర్ రెడ్డి గారిని చర్లపల్లి జైల్లో పరామర్శించామని తెలిపారు. పట్నం నరేందర్ రెడ్డిని కలిసినప్పుడు ఆయన తన గురించి కాకుండా 30 మంది అమాయక రైతులను విడిపించండని చెప్పారని తెలిపారు. అందుకు నరేందర్ రెడ్డికి అభినందనలు చెప్పారు. కొడంగల్‌లో దళిత, గిరిజన, బహుజన భూములు గుంజుకొని అక్కర్లేని ఫార్మా విలేజ్‌ను రుద్దుతున్నారని.. వారికోసం పోరాటం చేయండని చెబుతూ బాధపడుతున్నారని పేర్కొన్నారు. సంగారెడ్డి జైలు నుంచి చర్లపల్లి జైలు వరకు తప్పు చేయని అమాయకులు జైల్లో ఉన్నారని కేటీఆర్ అన్నారు. కానీ కొడంగల్ నుంచి కొండారెడ్డి పల్లె వరకు అరాచకాలు చేస్తున్న దుర్మార్గులు గద్దెనెక్కి కూర్చున్నారని మండిపడ్డారు. కొడంగల్‌లో అర్ధరాత్రి పూట ఇళ్లపై పడి మహిళలు, పిల్లలపై అరాచకాలు చేస్తూ పేద రైతుల భూములు గుంజుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి సొంతూరు కొండారెడ్డిపల్లిలో మాజీ సర్పంచ్ 85 ఏళ్ల సాయిరెడ్డి అనే వ్యక్తిపై పగబట్టారన్నారు. రేవంత్ రెడ్డి కోసం ఆయన మొన్నటి ఎన్నికల్లో పనిచేశారని.. కానీ ఆయన ఇంటికి అడ్డంగా గోడకట్టి తోవ లేకుండా చేశారని చెప్పారు. ఆ క్షోభ, అవమానంతో సాయిరెడ్డి ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. నియంతలు, దుర్మార్గుల పాలనలోనే ఇలాంటి సంఘటనలు చూస్తుంటామని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో మేము అధికారంలో ఉన్నామని.. ఎప్పుడైనా ఇలాంటి ఘటనల గురించి విన్నామా అని ప్రశ్నించారు. సొంత ఊరు, సొంత నియోజకవర్గమైతే నీ సామ్రాజ్యమా, నువ్వు చక్రవర్తివా అని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. వెయ్యి ఏళ్లు బతకటానికి ఏమైనా వచ్చావా అని వ్యాఖ్యానించారు. సొంత ఊరు, సొంత నియోజకవర్గమైతే నేను ఆడింది ఆట, పాడింది పాట అంటే కుదరదని స్పష్టం చేశారు. నువ్వు నియంత కాదు.. చక్రవర్తి కాదు.. నీలాంటి వాళ్లు చాలా మంది కొట్టుకుపోయారు. నువ్వు కూడా కొట్టుకుపోతావని అన్నారు. శిశుపాలుడి తప్పులను ఆనాడు లెక్కించినట్లు కాంగ్రెస్ ప్రభుత్వ అరాచకాలు, రేవంత్ రెడ్డి పాపాలను ప్రజలు ఇప్పుడు లెక్కిస్తున్నారని తెలిపారు. భూ కుంభకోణాలు, ఫార్మా విలేజ్ పేరుతో దౌర్జన్యాలు, పేద, గిరిజన రైతుల కుటుంబాల మీద అర్ధరాత్రి బందిపోట్ల మాదిరిగా పోలీసులు దాడి చేస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం ఉంది కదా అని విచ్చలవిడిగా దౌర్జన్యం చేస్తూ సాయిరెడ్డి, గురువా రెడ్డి లాంటి వాళ్లు ఆత్మహత్యలు చేసుకునే విధంగా చేశారని విమర్శించారు. సొంత గ్రామంలో చేస్తున్న అరాచకాల పాపాలు పండే రోజు దగ్గరలోనే ఉందని తెలిపారు. నీ కన్నా పెద్ద పెద్ద నియంతలు కూడా కొట్టుకుపోయారని అన్నారు. మా నేత నరేందర్ రెడ్డి చాలా ధైర్యంగా ఉన్నాడని అన్నారు. పేదలు, గిరిజన రైతులకు అన్యాయం జరగకుండా చూడాలని కోరాడని చెప్పారు. మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ చేపట్టనున్న ధర్నా బాగా చేయాలంటూ మాకు ఉత్సాహానిచ్చారని అన్నారు. నరేందర్ రెడ్డికి, చేయని తప్పునకు జైల్లో ఉన్న 30 మంది అమాయక రైతుల కుటుంబాలకు ఒకటే చెబుతున్నాం.. మీరు భయపడాల్సిన అవసరం లేదు.. మీ వెనుక కేసీఆర్ ఉన్నాడు. తప్పకుండా న్యాయం, ధర్మం గెలుస్తుంది.. అని కేటీఆర్ భరోసా ఇచ్చారు. రేవంత్ రెడ్డి మిమ్మల్ని నాలుగు రోజులు జైల్లో పెట్టవచ్చు.. కానీ ఆయనకు మళ్లీ రాజకీయ జీవితం లేకుండా చేసే బాధ్యత మీ మీద ఉందని చెప్పారు.

## మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాభవం.. సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ కీలక సూచన

ఎక్కడైనా ప్రాంతీయ పార్టీలదే హవా అని మహారాష్ట్ర, జార?ండ్ ఎన్నికల ఫలితాలతో మరోసారి వెల్లడైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. భారత రాజకీయాల్లో ప్రాంతీయ పార్టీల సత్తా కొనసాగుతోంది.. భవిష్యత్తులోనూ కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రాంతీయ పార్టీలకంటే కూడా కుదేలైందని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చేతగానితనంతోనే బీజేపీ పుంజుకుందని పేర్కొన్నారు. రెండు జాతీయ పార్టీలు అధికారం కోసం సిగ్గులేకుండా ప్రాంతీయ పార్టీల కష్టంపై ఆధారపడ్డాయని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి చేసిన ప్రచారం, ప్రసంగాలు, డబ్బుల సంచులు ఏవీ కూడా కాంగ్రెస్‌ను గెలిపించలేకపోయాయని కేటీఆర్ అన్నారు. హెలికాప్టర్ ప్రమాదం కూడా కాంగ్రెస్ ఫెయిల్యూర్‌ను తప్పించలేకపోయిందని విమర్శించారు.

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి కూడా కేటీఆర్ ఒక సలహా ఇచ్చారు. ముందు ముఖ్యమంత్రిగా ప్రాథమిక బాధ్యతలపై దృష్టి సారించాలని సూచించారు. ఏడాది క్రితం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలన్నారు.

## నరేందర్‌రెడ్డి రెచ్చగొట్టడం వల్లే లగచర్లలో దాడి: పబ్లిక్ ప్రాసిక్యూటర్

హైదరాబాద్: వికారాబాద్ జిల్లా లగచర్ల దాడి కేసులో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో మరోసారి వాదనలు జరిగాయి. కొడంగల్ కోర్టు విధించిన రిమాండ్‌ను కొట్టివేయాలని పట్నం నరేందర్ రెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. ఫార్మా విలేజ్ కోసం ప్రభుత్వం చేపట్టాలనుకున్న భూసేకరణకు వ్యతిరేకంగా, ప్రజలను రెచ్చగొట్టేలా నరేందర్ రెడ్డి మాట్లాడారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగేశ్వర్‌రావు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఆ వీడియోలను సీడీల రూపంలో కోర్టుకు అందజేశారు. నరేందర్‌రెడ్డి రెచ్చగొట్టడం వల్లే ప్రజలు కలెక్టర్, ఇతర అధికారులపై దాడికి పాల్పడ్డారని ఆయన వాదించారు. నరేందర్ రెడ్డిని కేబీఆర్ పార్కు వద్ద అరెస్ట్ చేయలేదన్నారు.

కేబీఆర్ పార్కుకు వెళ్తుంటే అరెస్ట్ చేశారని ఆయన సమర్పించిన అఫిడవిట్‌లోనే ఉందని పీపీ కోర్టుకు తెలిపారు. 15మంది పోలీసులు మఫ్టీలో వచ్చి నరేందర్‌రెడ్డిని ఓ ఉగ్రవాదిలా అరెస్ట్ చేసి తీసుకుపోయారని ఆయన తరఫు న్యాయవాది గండ్ర మోహన్‌రావు కోర్టుకు తెలిపారు. అరెస్ట్‌కు సంబంధించిన కొన్ని ఫొటోలను కోర్టుకు అందించారు. అరెస్ట్ సమయంలో పోలీసులు సుప్రీంకోర్టు నిబంధనలు పాటించలేదని వాదించారు. ఇరువురి వాదనలు విన్న హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com